జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php








సంపుటి 12 సంచిక 210 విశాఖపట్నం | శనివారం 17 ఏప్రిల్ 2021 | 8 పేజీలు | వెల : 5.00






## ప్రధాని మోదీకి సీఎం జగన్ లేఖ

అమరావతి,ఏప్రిల్ 16, ప్రజాపాలన ప్రతినిధి: కరోనా కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రానికి 60 లక్షల డోసుల వ్యాక్సిన్ పంపాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లేఖ రాశారు. టీకా ఉత్సవ్‌లో భాగంగా ఒక్కరోజే 6,28,961 డోసులు ఇచ్చినట్లు లేఖలో పేర్కొన్నారు. ఈ విషయంలో ఏ రాష్ట్రంతో పోల్చినా ఏపీలోనే ఎక్కువ డోసులు ఇచ్చామని సీఎం తెలిపారు. గ్రామ, వార్డు వాలంటీర్ల వ్యవస్థ వల్లే ఇది సాధ్యమైందన్నారు.ప్రతి 50 కుటుంబాల అవసరాలను ఒక వాలంటీరు తీరుస్తున్నారని ప్రధానికి వివరించారు. వ్యాక్సిన్ డ్రైవ్‌ను ఏపీలో వాలంటీర్లు సమర్థంగా చేపట్టారన్నారు. అర్హత ఉన్న ప్రతీ వ్యక్తికి వ్యాక్సిన్ అందేలా చూస్తున్నామన్నారు. వచ్చే మూడు వారాల్లో ఏపీలో 45 ఏళ్లు దాటిన ప్రతీ ఒక్కరికి వ్యాక్సిన్ అందిస్తామని తెలిపారు. ఆ లక్ష్య సాధన కోసం ఏపీకి 60 లక్షల డోసులు కేటాయించాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు.

# ఏపీ అమూల్ పాలవెల్లువ ప్రాజెక్ట్ విస్తరణ

అమరావతి, ఏప్రిల్ 16, ప్రజాపాలన ప్రతినిధి: ఏపీ అమూల్ పాలవెల్లువ ప్రాజెక్ట్ గుంటూరు జిల్లాలో విస్తరణ సందర్భంగా పలువురు పాడి రైతులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు.

నాదెండ్ల మండలం చందవరం నుంచి కే. ప్రభావతి ముఖ్యమంత్రి తో మాట్లాడుతూ..

మాకు రెండు గేదెలు ఉన్నాయి, రోజూ 5 లీటర్ల పాలు పోస్తున్నాం, గతంలో ప్రైవేట్ డెయిరీలకు పాలు పోశాం. రోజుకూ లీటర్ రూ. 35 నుంచి రూ. 45 వరకూ వచ్చేవి, కానీ ఏం మిగిలేవి కావు, ఇప్పుడు అమూల్ డెయిరీకి పోయడం వల్ల లీటర్ కు అదనంగా రూ. 20 ఎక్కువ వస్తుంది, లీటర్ పాలు రూ. 60 నుంచి రూ. 70 వరకూ రావడంతో చాలా సంతోషంగా ఉంది, మా కుటుంబానికి ఆదారంగా నిలబడుతుంది, మీకు ధన్యవాదాలు, మా కుటుంబంలో అన్ని పథకాలు అందుతున్నాయి, మీ పరిపాలన బావుంది, అందరూ సంతోషంగా ఉన్నాం సార్. ప్రతీ ఒక్కరినీ మీ కుటంబంలా చూస్తున్నారు సార్, మా ఊరి తరపున మీకు ధన్యవాదాలు సార్, అని ఆమె సంతోషాన్ని ముఖ్యమంత్రితో పంచుకున్నారు.






ఎడ్లపాడు మండలం లింగారావుపాలెం నుంచి మార్తమ్మ ముఖ్యమంత్రి తో మాట్లాడుతూ..

పాలవెల్లువ మహిళా డెయిరీలో నేను సభ్యురాలిని, నేను ఈ పది రోజుల్లో 40 లీటర్ల పాలు పోస్తే రూ. 2120 వచ్చాయి, గతంలో మాకు పది రోజులకు రూ. 1800 మాత్రమే వచ్చేవి, లీటర్‌కు అదనంగా రూ. 10 వస్తున్నాయి, మాకు సంతోషంగా ఉంది. పాల వెన్న శాతం కచ్చితంగా చూస్తున్నాం, నాడు నేడు కింద మా గ్రామంలో అన్నీ మార్చారు, మాకు ఇళ్ళ పట్టాలు వచ్చాయి, మా అత్తగారికి వైఎస్ఆర్ ఆసరా కింద రూ. 18,750 డబ్బు అందింది, మా పిల్లలు ఇంగ్లీషు మీడియం చదువుతున్నారు. డ్వాక్రా లోన్ తీసుకుని గేదెను కొనుక్కున్నాం, ఇప్పుడు ఇంకో గేదెను కొనాలనుకుంటున్నాం. ఇలాంటి మంచి కార్యక్రమాలను మా మహిళలకు ఏర్పాటుచేసినందుకు మీకు ధన్యవాదాలు సార్, అని ముఖ్యమంత్రితో ఆమె సంతోషాన్ని పంచుకున్నారు.

నాదెండ్ల మండలం చిరుమామిళ్ళ నుంచి నందిని అను మహిళ ముఖ్యమంత్రి తో మాట్లాడుతూ...

సార్ నేను మహిళా డెయిరీలో సెక్రటరీగా పనిచేస్తున్నా, ఈ డెయిరీలో ఆటోమెటిక్ పరికరాల వల్ల ఫ్యాట్ శాతం కానీ ఎస్ఎన్ఎఫ్ శాతం కరెక్ట్‌గా వస్తున్నాయి. దీంతో పాడిరైతులకు **(మిగతా 2లో...)**

# ప్రముఖ వైద్యులు కాకర్ల ఇకలేరు




విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి: నెల రోజుల క్రితం కిమ్స్ ఆసుపత్రిలో చేరిన ఆయన చికిత్స పొందుతూ ఈరోజు ఉదయం తుదిశ్వాస విడిచారు.కాకర్ల సుబ్బారావు 1925లో కృష్ణా జిల్లా పెదముత్తేవిలో వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. పాఠశాల విద్యాభ్యాసం చల్లపల్లిలో, కళాశాల విద్యాభ్యాసం మచిలీపట్నం హిందూ కళాశాలలో సాగింది. విశాఖ ఆంధ్ర వైద్య కళాశాల నుంచి డాక్టర్ పట్టా పొందారు. 1951లో హౌస్ సర్జన్ చేసిన తర్వాత వైద్యంలో ఉన్నత విద్య కోసం ప్రత్యేక పారితోషికంతో అమెరికా వెళ్లారు. అమెరికా రేడియాలజీ బోర్డు పరీక్షల్లో 1955లో ఉత్తీర్ణులయ్యారు. న్యూయార్క్, బాల్టిమోర్ నగరాల్లోని ఆసుపత్రుల్లో 1954 నుంచి 56 వరకు పనిచేశారు. 1956లో స్వదేశానికి తిరిగి వచ్చి హైదరాబాద్‌లోని ఉస్మానియా వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. ఆ తర్వాత ఉస్మానియా కళాశాలలోనే ప్రధాన రేడియాలజిస్టుగా పదోన్నతి పొందారు.

నిమ్స్ అభివృద్ధికి విశేష కృషి..

1970లో సుబ్బరావు మళ్లీ అమెరికా వెళ్లారు. యునైటెడ్ కింగ్‌డమ్ వారి ఫెల్లో ఆఫ్ రాయల్ కాలేజి ఆఫ్ రేడియాలజిస్టు పట్టా పొందారు. ఆ తర్వాత అమెరికాలోని అనేక అసుపత్రులలో పనిచేశారు. తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా తొలి అధ్యక్షుడిగా సేవలందించారు. 1986లో ఎన్టీ రామారావు ప్రవాస ఆంధ్రులకు చేసిన విజ్ఞప్తి మేరకు కాకర్ల స్వదేశానికి తిరిగి వచ్చి హైదరాబాద్ నిమ్స్‌లో కీలక బాధ్యతలు చేపట్టారు. నిమ్స్‌లోని అన్ని విభాగాలను అభివృద్ధి చేశారు. రాష్ట్రంలోని ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులకు దీటైన స్థాయికి నిమ్స్‌ను తీసుకొచ్చారు. రేడియాలజీ విభాగంలో అనేక పుస్తకాలు, జర్నల్స్‌లో పరిశోధనా వ్యాసాలు రాసిన డాక్టర్ కాకర్ల దేశ.. విదేశాలలో వైద్య ఉపన్యాసాలు ఇచ్చారు. 50 ఏళ్ల అనుభవంలో అనేక బహుమతులు, సత్కారాలు పొందారు. వైద్యశాఖకు, మానవాళికి చేసిన సేవకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం నుంచి 2000 సంవత్సరంలో పద్మశ్రీ అవార్డు పొందారు.

## విశాఖకు రాజధాని వస్తుంది: ఎంపీ విజయసాయిరెడ్డి



విశాఖ: త్వరలోనే ఏపీకి విశాఖ రాజధానిగా వస్తుందని ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. ఈ రోజు ఆయన మీడియాతో మట్లాడారు. విశాఖను సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని విజయసాయిరెడ్డి తెలిపారు. విశాఖలో 740 స్లమ్ ఏరియాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రాజధాని నగరంగా మారునున్నందున స్లమ్ లేని నగరంగా విశాఖను తీర్చిదిద్దుతామని ఆయన పిలుపునిచ్చారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్, భీమిలి 6 లైన్ల రోడ్లకు త్వరలో సీఎం శంకుస్థాపన చేస్తారని విజయసాయిరెడ్డి తెలిపారు. ఉత్తరాంధ్రలో నిరుద్యోగుల కోసం త్వరలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు. 4 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబు ఏదైనా చేయించుకోగలడని ఆయన ధ్వజమెత్తారు. చిన్న గులకరాయిని తన సభ మీద వేయించుకొని పెద్ద రాద్ధాంతం చేశారని విజయసాయిరెడ్డి విమర్శించారు. తిరుపతి ఉప ఎన్నికలలో వైసీపీకి జనసేన, టీడీపీ, బీజేపీలు అసలే పోటీనే కాదని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. 17 తర్వాత తమ పార్టీ ఉండదని టీడీపీ నేత అచ్చెన్నాయుడు అన్నారని విజయసాయి తెలిపారు.



## రెవెన్యూ సమస్యలపై మంత్రి ధర్మాన సమీక్ష

అమరావతి: రెవెన్యూశాఖలో నెలకొన్న పెండింగ్ సమస్యలపై అధికారులతో మంత్రి ధర్మాన సమీక్ష నిర్వహించారు. జూనియర్ అసిస్టెంట్ల పదోన్నతులపై అధికారులతో మంత్రి చర్చించారు. వివాదాలకు తావులేకుండా పదోన్నతులు ఇస్తామని అధికారులు తెలిపారు. భూ రీ సర్వే వివరాలను మంత్రి ధర్మానకు అధికారులు వివరించారు.



## ఎల్వోసీ సైనికులకు సిగ్, గలిల్, పికా గన్స్..

శ్రీనగర్,ఏప్రిల్ 16, ప్రజాపాలన ప్రతినిధి: భారతీయ సైనికులకు కొత్త ఆయుధాలు వచ్చాయి. నియంత్రణ రేఖ వద్ద విధులు నిర్వర్తిస్తున్న సైనికులకు అత్యాధునిక రైఫిళ్లను అందించారు. సిగ్ సావర్ అజాల్ట్ రైఫిళ్లతో పాటు గలిల్ స్నైపర్ రైఫిళ్లను కూడా అక్కడ విధుల్లో ఉన్న సైనికులకు ఇచ్చారు. చొరబాటుదారులను అడ్డుకునేందుకు ఈ ఆయుధాలు ఉపయోగపడనున్నాయి. నియంత్రణ రేఖ వెంట జరుగుతున్న ఉగ్రవాద కార్యకలాపాలను కూడా నియంత్రించేందుకు ఈ ఆధునిక ఆయుధాలు ఉపకరిస్తాయి. ఆధునిక ఆయుధాలు అత్యంత ప్రాణాంతకమైనవని ఇండియన్ ఆర్మీ అధికారులు చెప్పారు. పికా మెషీన్ గన్స్లు కూడా సైనిక సామర్థ్యాన్ని పెంచినట్లు అధికారులు వెల్లడించారు.

# మూడు దశాబ్దాల అడుగులు

నెల్లూరు, ఏప్రిల్ 16, :జగన్ తాను ముప్పయ్యేళ్ళ పాటు సీఎం గా ఉంటాను ఒకప్పుడు అంటే అంతా ఎద్దేవా చేసేవారు. అవును అపుడు జగన్ ఎన్నికల్లో ఓడిపోయి విపక్షంలో ఉండేవారు. ఆయన పార్టీ నేతలు కూడా నిస్తేజంగా ఉండేవారు. మరో వైపు చంద్రబాబు ఎత్తులు జిత్తులు తట్టుకోలేక జగన్ ఒక విధంగా చేతులెత్తేసిన పరిస్థితి ఉంది. ఇక 23 మంది వైసీపీ ఎమ్మెల్యేలను చంద్రబాబు విడతల వారీగా తీసుకుని జగన్ పార్టీకి భారీ డ్యామేజ్ కలిగించారు. జగన్ కనుక పాదయాత్ర చేయకపోతే కచ్చితంగా వైసీపీ ఏనాడో ఆవిరై అంతర్ధానమైపోయేదే.ఒక దీపం మరో దీపాన్ని వెలిగిస్తుంది. అలాగే ఒకసారి వచ్చిన అధికారం మళ్ళీ మళ్లీ అధికారం దక్కడానికి బాటకు వేస్తుంది. అయితే దానికి అటు ప్రభుత్వపరంగా, ఇటు పార్టీ పరంగా భారీ మార్పులే చేయాలి. అందుకే జగన్ ఎవరినీ లక్ష్యపెట్టకుండా తాను అనుకున్నది అనుకున్నట్లుగా చేసేస్తున్నారు. ఏపీలో వివిధ సామాజికవర్గాలకు చెందిన వారిని అయిదుగురిని డిప్యూటీ సీఎంలను చేసినా ఏకంగా అరవైకి తక్కువ కాకుండా బీసీల్లోని వివిధ కులాలకు కార్పోరేషన్లు ఏర్పాటు చేసి వందల కొద్దీ పదవులు ఇచ్చినా కూడా అక్కడ జగన్ మార్క్ సోషల్ ఇంజనీరింగ్ ఉందని అంటారు.ఇక మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో మేయర్లు, డిప్యూటీ మేయర్ల ఎంపిక జగన్ భవిష్యత్తు దృష్టిని చెబుతోంది అంటున్నారు. ఏనాడు అధికార పదవులు పొందని కులాలను తెచ్చి అగ్రాసనం మీద జగన్ కూర్చోబెట్టారు. విజయవాడ లాంటి చోట శ్రీకాకుళం జిల్లా నుంచి వలసలుగా వెళ్ళి ఉపాధి పొందే నగరాలకు చెందిన ఒక మహిళను మేయర్ గా చేయడం ద్వారా జగన్ అక్కడ కమ్మ లాబీకి గట్టిగానే గండి కొట్టారు అన్నది ఒక విశ్లేషణ. ఇక విశాఖ వంటి మెగా సిటీకి మేయర్ గా సిటీలో అత్యధిక శాతం జనాభా ఉన్న యాదవుల నుంచి ఎంపిక చేయడం ద్వారా జగన్ రాజకీయంగా టీడీపీని బాగా దెబ్బ తీశారని అంటున్నారు. ఇలాంటి నియామకాలే ఆయన మునిసిపాలిటీ పదవుల్లో ఎన్నో చేశారు.ఇక ఏపీలో జిల్లా పరిషత్తులు 13 ఉన్నాయి. అలాగే వందలాది మండల పరిషత్ చైర్మన్ పదవులు ఉన్నాయి. ఇవి కాకుండా వైఎస్ చైర్మన్ పోస్టులు పెద్ద ఎత్తున ఉన్నాయి. ఇవన్నీ కూడా బీసీలు, ఎస్సీ, మైనారిటీలు, మహిళలే టార్గెట్ గా చేసుకుని పంచిపెట్టడానికి జగన్ తాజాగా




ప్రణాళికలను రూపొందించారు అంటున్నారు. ఈ విషయంలో మంత్రులు కానీ ఎమ్మెల్యేలు కానీ వేలూ కాలూ పెట్టడానికి వీలులేకుండా అన్నీ తానే అయి జగన్ ఎంపిక చేస్తున్నారు అన్న మాట ఉంది. ఈ విధంగా తన పార్టీకి అత్యధిక జనాభా ఉన్న వర్గాలను పెట్టని కోటగా చేసుకోవాలని జగన్ అనుకుంటున్నారు. ఏపీలో టీడీపీ పరిస్థితి దిగనారుతున్న వేళ బీసీలకు వైసీపీ అండగా ఉండడం ఇక్కడ విశేషం. ఆ వర్గం దన్ను ఉండబట్టే టీడీపీ అనేకసార్లు అధికారంలోకి వచ్చింది. ఇక వైసీపీకి బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీలు, మైనారిటీలు కూడా అండగా ఉండేలా జగన్ ప్లాన్ రూపొందించారు. సో మొత్తానికి ముప్పయ్యేళ్ళ సీఎం కలను సాకారం చేసుకునే దిశగా జగన్ అడుగులు అయితే దూకుడుగానే పడుతున్నాయి.




# లోకేష్ క్వాలిఫికేషన్ అదేనా...?

తిరుపతి, ఏప్రిల్ 16, :లోకేష్ సీన్ టీడీపీలో ఏంటో అచ్చెన్నాయుడు తాజాగా వైరల్ అయిన ఒక వీడియోలో చక్కగా చెప్పేశాడు. దాదాపుగా సీనియర్ నేతల అందరి మాట కూడా అదే అంటున్నారు. లోకేష్ 2014 ఎన్నికల తరువాత పూర్తి స్థాయి రాజకీయాల్లోకి దిగారు. అంటే ఆయన పొలిటికల్ కెరీర్ వయసు ఏడేళ్ళుగా భావించాలి. మరి ఈ ఏడేళ్ళ కాలంలో రెండేళ్ల కాలం అయిదు కీలకమైన శాఖలకు మంత్రిగా కూడా ఆయన పనిచేశారు. ఇక తెలుగుదేశం పార్టీలో ఆయనే తెర వెనక చక్రం తిప్పుతూ బాబు తరువాత తానే అనిపించుకున్నారు. మరి ఇవన్నీ కలిపి కూడితే ఈపాటికే లోకేష్ రాజకీయ పాండిత్యం ఎక్కడికో వెళ్ళాలి. కానీ ఈ రోజుకీ సన్ ఆఫ్ చంద్రబాబు ట్యాగ్ తోనే లోకేష్ కొనసాగుతున్నారు అంటేనే ఎక్కడో తేడా కొడుతోంది అని అర్ధం చేసుకోవాలి. మంగళగిరిలో తాను స్వయంగా ఓడాక పార్టీలో ఆయన గ్రాఫ్ ఒక్కసారిగా పడిపోయింది అని చెబుతారు. ఇక ఓడిన లోకేష్ పార్టీ అభ్యర్ధుల కోసం ప్రచారం చేయడమేంటి అని లోకల్ బాడీ ఎన్నికల వేళనే విమర్శలు వచ్చాయి. సొంత పార్టీలోనూ చాలా మంది గుసగుసలు పోయారు. ఇపుడు లోకేష్ గాలి తీసేలా వైసీపీ మంత్రి కన్నబాబు కూడా అదే మాట అంటున్నారు. ఎమ్మెల్యేగా గెలవడానికి సీన్ లేదు కానీ తిరుపతిలో ఎంపీ అభ్యర్ధిని ఎలా గెలిపిస్తావ్ లోకేష్ అంటూ ఎకసెక్కమాడారు. ఇపుడు ఇదే లోకేష్ కి అతి పెద్ద మైనస్ పాయింటుగా మారింది మరి. ఆయన ఎటువంటి సవాళ్ళు చేసినా భారీగా స్టేట్మెంట్లు ఇచ్చినా అవి పొలిటికల్ కామెడీగానే మిగిలిపోతున్నాయి. నాయకుడు అన్న వాడు వారసుడా లేక మరోటా అన్న ప్రశ్న ఇక్కడ కాదు, గెలిపించేవాడే నేత అని రాజకీయ డిక్షనరీలో అచ్చు గుద్ది మరీ ఉంది. దానికి చినబాబు సరిగా చదువుకోలేదు. పైగా తండ్రి చంద్రబాబు చేతుల్లో నుంచి పార్టీని తీసుకుంటే తానే బాస్ అని అంతా ఒప్పుకుంటారు అనుకుంటున్నారని సెటైర్లు పడుతున్నాయి. జాతీయ కార్యదర్శి పదవి అయితే చంద్రబాబు సులువుగా ఇచ్చేయగలరు, అయిదు శాఖల మంత్రిగానూ ఓవర్ నైట్ చేయగలరు, కానీ పార్టీ మొత్తం లోకేష్ ని మా నేత అని ఆమోదించేలా బాబు సైతం చేయలేరుగా. మరి ఇక్కడే లోకేష్ సామర్థ్యం సత్తా ఏంటో చూపించాల్సిన సమయం ఆసన్నమైంది. ఆయనే ఉంటే మంగలోడు ఎందుకు అని ఒక ముతక సామెత ఉంది. కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే కొడుకు అన్నట్లుగా లోకేష్ ధీటైన నేతగా ఉంటే తిరుపతి లోక్ సభ ఉప ఎన్నికల్లో చంద్రబాబు ఎందుకు కాళ్ళరిగిలేలా ఎనిమిది రోజుల పాటు వూరూ వాడా తిరుగుతారు అన్న చర్చ కూడా ఉంది. అంటే చంద్రబాబే లోకేష్ సామర్థ్యం ఏంటో నోట చెప్పకుండానే గుట్టు విప్పేసారు అంటున్నారు. అలాంటిది అచ్చెన్న అన్నాడనో మరో వైసీపీ నేత విమర్శించాడనో ఆవేశపడి భుజాలు తడుముకోవడం ఎందుకు అన్నదే హితైషులు చినబాబుకు చెబుతున్న మాట. ఇప్పటికైనా మించిపోయినది ఏమీ



లేదు. ముందు లోకేష్ తన మైనస్ పాయింట్లు ఏంటో తెలుసుకోవాలి. ఆదరాబాదరాగా నాయకుడు కాలేమని గ్రహించాలి. అన్నింటికీ మించి జగన్ కి తాను సరిజోడు నేత ప్రస్తుతానికి కాను అని అయినా గట్టిగా అనుకుని కార్యాచరణకు దిగాలి. లేకపోతే ఇవాళ అచ్చెన్న అన్నాడు, రేపు మరో బుచ్చెన్న కూడా ఇదే మాట అంటాడు. అపుడు అసలు తట్టుకోలేవు లోకేషూ అంటున్నారు ఆయన అభిమాన జనం.

## ఆహార భద్రత పై దుకాణాలు తనిఖీ



పొన్నూరు , ప్రజాపాలన ప్రతినిధి:ఆహార కల్తీ నిరోధించేందుకు శుక్రవారం పొన్నూరు పట్టణంలో పలు రకాల దుకాణాలను అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేశారు. గుంటూరు ఫుడ్ ఇన్స్పెక్టర్ సుందర రామిరెడ్డి, పొన్నూరు మున్సిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, సానిటరీ ఇన్స్పెక్టర్ లక్ష్మీపతి, సానిటరీ సూపరువై జర్లు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. కొన్ని రకాల స్యాంపుల్స్ సేకరించారు. అనుమానం మీద కొన్ని దుకాణాలు పై కేసులు నమోదు చేశారు.

## తిరుపతిలో 50 కోట్ల పాత నోట్ల సంగతేంటీ



తిరుమల, ఏప్రిల్ 16, :ము వీందరావంత ధర్మాన్ని ఉద్దరించే వాళ్లమని, దానికోసం అహార్నిశలూ పాటుపడతామని చెప్పుకునే బిజెపి ప్రభుత్వ పెద్దలు తిరుమలలోని వెంకన్న పట్ల కరుణ లేకుండా వ్యవహరిస్తున్నారు. టిటిడి వద్ద ఉన్న మలేషియా నాణేల మార్పుడికి, రద్దయిన పాత నోట్లను మార్చుకోవడానికి అనుమతి ఇవ్వకుండా నిర్దయగా వ్యవహరిస్తున్నారు. దీంతో, తిరుమల శ్రీవారికి భక్తులు సమర్పించిన కానుకలు వినియోగంలోకి రాకుండాపోతున్నాయి. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వైఖరి కారణంగా కోట్ల రూపాయల విలువైన విదేశీ నాణేలు చిల్లర పెంకులతో సమానమయ్యాయి. దేశ, విదేశాల్లోని భక్తులు కూడా ఎంతో భక్తితో స్వామివారి హుండీలో ఆయా దేశాల కరెన్సీ, నాణేలు కానుకగా వేస్తూ ఉంటారు. వీటిని మన దేశ కరెన్సీలో మార్చుకోవాల్సింది ఉంటుంది. ఇందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో ఈ నగదు వినియోగంలోకి రావడం లేదు. టిటిడి వద్ద మలేషియా నాణేలు 40 టన్నులకుపైగా నిల్వలు పేరుకుపోయి ఉన్నాయి. మలేషియా నాణేన్ని అక్కడ (రింగిట్) అంటారు. మన రూపాయితో పోల్చితే మలేషియా నాణెం (రింగిట్) విలువ రూ.17. మనకు పావలా, అర్థ రూపాయి, రూపాయి నాణేలు ఉన్నట్లు మలేషియాలో ఐదు సెంట్లు, పది సెంట్లు, 20 సెంట్లు, 50 సెంట్లు ఉండేవి. ఈ నాణేలను మార్చాలని పలుసార్లు టిటిడి అధికారులు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకున్న పాపానపోలేదు. నోట్ల రద్దు సమయంలో తిరుమల శ్రీవారికి పెద్ద ఎత్తున పాత నోట్లను భక్తులు సమర్పించుకున్నారు. కేంద్రం ఆ పాతనోట్లను ఓ సమయం వరకే మార్పిడి చేసింది. ఆ గడువు ముగిసిన తర్వాత కూడా శ్రీవారి హుండీలో పాత నోట్లను కొంతమంది భక్తులు వేస్తూ వచ్చారు. అలా ఇప్పటికి రూ.యాభై కోట్ల వరకూ పోగుపడ్డాయి. వాటిని మార్చుకునే టిటిడి గతంలో చేసిన విజ్ఞప్తిని ఆర్బిఐ కూడా పట్టించుకోలేదు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వద్దకు టిటిడి చైర్మన్ వెళ్లి విన్నవించారు. కరోనా కాలంలో లాక్డౌన్ వల్ల టిటిడికి ఆదాయ మార్గాలు లేకుండాపోయాయని, పాత నోట్లను మార్చి టిటిడిని ఆదుకోవాలని విన్నవించారు. అయినా, బిజెపి ప్రభుత్వంలో లేకుండాపోయింది. టిటిడికి ఉపయోగపడాలనే, మంచి కార్యక్రమాలకు వినియోగించాలనే ఉద్దేశంతో భక్తులు కానుకలు హుండీలే వేస్తుంటారు. కేంద్ర ప్రభుత్వ తీరుతో భక్తులు ఏ ఉద్దేశంతో కానుకలను స్వామి వారికి సమర్పించారో అది నెరవేరకుండాపోతోంది. మరో వైపు బిజెపి పెద్దలు చెబుతున్న మాటలకు, ఆచరణకు కొద్దిగా కూడా పొంతన లేదు. హిందూ మత ఉద్ధారకులుగా చెప్పుకునే వీరు వెంకన్నపై కొద్దిగా కూడా భక్తి లేదనే స్పష్టమవుతోంది. కేంద్ర ప్రభుత్వం తల్చుకుంటే 40 టన్నుల మలేషియా నాణేలను, పాత నోట్లను మార్చడం పెద్ద కష్టం కాదు. ఇందుకు అనుమతి ఇవ్వకపోవడాన్ని బట్టి వెంకన్నపై బిజెపికి ఉన్న చిత్తశుద్ధి ఏ పాటిదో అర్థమవుతోంది.

# రెన్యువల్ సంగతి కష్టమేనా..?



విశాఖపట్టణం, ఏప్రిల్ 16, :విజయసాయిరెడ్డి అంటేనే జగన్ కి కుడి భుజం అని చెబుతారు. ఆయన మాట్లాడితే దాని వెనక జగన్ ఉన్నారని కూడా భ్రమపడతారు. విజయసాయిరెడ్డి ఈ మధ్యకాలం దాకా ఉత్తరాంధ్రా జిల్లాల్లో ఏకచత్రాధిపత్యమే చేశారు. పార్టీలో ఎటువంటి సీనియర్ నేత అయినా సరే ఆయన ముందు దిగదుడుపే అన్నట్లుగా ఉండేది. కానీ విశాఖ కార్పోరేషన్ ఎన్నికల తరువాత మాత్రం విజయసాయిరెడ్డి ఫుల్ సైలెంట్ అయ్యారు. ఆయన వూసు అన్నది కూడా పెద్దగా లేకుండా పోయింది. విజయసాయిరెడ్డికి విశాఖ కార్పోరేషన్ లో వైసీపీని గెలిపించే బాధ్యతలను జగన్ పూర్తిగా అప్పగించేశారు. ఆయనే మొత్తం అన్నట్లుగా తిరిగారు ఇక పార్టీ ఆయనకు ఫుల్ ఫ్రీడమ్ ఇచ్చేసింది. మరో వైపు ఆయన తానే మొత్తం 98 వార్డులకు కార్పోరేటర్లను సెలెక్ట్ చేశారు. నాయకులను ఇతర పార్టీల నుంచి చేర్చుకున్నారు. వారూ వీరు అని తేడా లేకుండా అందరినీ తన వెనకన తిప్పుకున్నారు. విజయసారధిగా తానే ఉండాలని ఉబలాటపడ్డారు. చివరికి మాత్రం సీన్ రివర్స్ అయింది బొటాబొటీ మెజారిటీతో వైసీపీ గెలవడంతో జగన్ గుస్సా అయ్యారని అంటున్నారు. విజయసాయిరెడ్డి నాటి నుంచి పార్టీ యాక్టివిటీస్ ని పూర్తిగా తగ్గించేశారు. మునిసిపలి ఎన్నికల్ అయిపోయిన దగ్గర నుంచి ఆయన పార్టీ జనాలను కూడా పెద్దగా కలుసుకోవడంలేదు అంటున్నారు అదే విధంగా బయట కార్యక్రమాలకు కూడా అటెండ్ కావడాన్ని పూర్తిగా తగ్గించేశారు. ఆయన ఢిల్లీలో ఉంటున్నారా లేక తన దత్తత సిటీ విశాఖలో మకాం చేస్తున్నారా అన్నది కూడా ఎవరికీ తెలియని పరిస్థితి ఉంది. ఇక పార్టీలో ఏం జరుగుతోంది. ఎవరిని కలవాలి, ఏం చేయాలి అని తెలియక నాయకులు కూడా సతమతమవుతున్నారుట. మరో వైపు విశాఖ పార్టీ విషయాలను కూడా విజయసాయిరెడ్డి పట్టించుకోవడంలేదు అన్న ప్రచారం కూడా సాగుతోంది. ఇక విజయసాయిరెడ్డి రాజ్యసభ సీటు వచ్చే ఏడాదితో ముగుస్తుంది. మరో మారు దాన్ని రెన్యూల్ చేయాలంటే అది జగన్ చేతిలోనే ఉంది. అంటే గట్టిగా ఏడాది కూడా ఆయన ఎంపీ పదవి లేదని అర్ధమవుతోంది. జగన్ కి ఇష్టుడిగా ఒకనాడు మెలిగిన విజయసాయిరెడ్డి ఇపుడు ఎందుకో దూరం అయ్యారని అంటున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయన పూర్తిగా ట్విట్టర్ పిట్టగానే మారిపోయారు అంటున్నారు. విజయసాయిరెడ్డి వైసీపీ పార్లమెంటరీ పార్టీ నేతగా ఎంపీలను కూడా సరిగ్గా కలుపుకుని పోలేకపోయారని అంటున్నారు. దాని వల్లనే మొదట్లో మంచిగా ఉన్న రెబెల్ ఎంపీ రఘురామరాజు కూడా జగన్ కి బద్ధ వ్యతిరేకి అయ్యారని కూడా పార్టీలో కామెంట్స్ ఉన్నాయి. మొత్తానికి విజయసాయిరెడ్డికి పార్టీలో విలువ తగ్గిందని కూడా టాక్. ఇదే సీన్ కొనసాగితే ఆయనకు రాజ్యసభ సీటు డౌట్ లో పడినట్లే అన్న చర్చ అయితే మాత్రం ఉంది.

# టీడీపీలో బీసీ సీఎం ప్రచారం..?

తిరుపతి, ఏప్రిల్ 16, :తెలుగుదేశానికి సర్వం సహా చంద్రబాబు ఉన్నారు. ఆయన కుమారుడు లోకేష్ కూడా రెడీగా ఉన్నారు. ఇక మిగిలిన వారంతా పార్టీకి సుశిక్షితులైన సైనికులు మాత్రమే. మరి వారి నుంచి రాజు ఎవరు అవుతారు. టీడీపీకి మూడవ ముఖ్యమంత్రి అభ్యర్ధి ఎక్కడ నుంచి వస్తారు అన్న ప్రశ్న ఎవరికైనా కలుగవచ్చు. మరి ఎన్టీఆర్ ప్రభ అఖండంగా విరాజిల్లుతున్న వేళ నాదెండ్ల భాస్కర రావు ముఖ్యమంత్రి కాలేదా? అన్న జవాబు కూడా వస్తుంది. అంతే కాదు ఎన్టీయార్ మూడవసారి అధికారంలోకి బంపర్ మెజారిటీతో వచ్చిన మీదట ఆయన ప్లేస్ లో మరొకరిని కలలో కూడా ఊహించని టైమ్ లో చంద్రబాబు ముఖ్యమంత్రి పీఠం పట్టేయలేదా అన్న మాట కూడా వస్తుంది. ఇక టీడీపీలో చూస్తే అచ్చెన్నాయుడు ఆషామాషీ నేత మాత్రం కాదు. ఆ మాటకు వస్తే వాళ్ల అన్నయ్య, దివంగత నేత ఎర్రన్నాయుడు కూడా అంతటి సామర్థ్యం ఉన్న నాయకుడే. అందుకే చంద్రబాబు అప్పట్లో ఆయన్ని తెలివిగా జాతీయ రాజకీయాలకు పరిమితం చేసి ఢిల్లీలోనే కొలువుండేలా చేశారు అన్న ప్రచారం కూడా ఉంది. ఇపుడు అచ్చెన్న చంద్రబాబుకు తలలో నాలుకగా ఉన్నారు. బాబుకి కుడి భుజం. ఆయన మాట జవదాటరు అని కూడా చెబుతారు. అందుకే ఆయన్ని మెచ్చి మరీ బాబు అటు శాసనసభలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పదవితో పాటు ఇటు ఏపీ టీడీపీ ప్రెసిడెంట్ పదవి కూడా ఇచ్చారు. బీసీ కార్డు తో చంద్రబాబు అచ్చెన్నకు లిఫ్ట్ ఇస్తూంటే అదే కార్డు ఫ్యూచర్ లో అచ్చెన్నకు బాగా ఉపయోపడేలా ఉందని అంటున్నారు. తెలుగుదేశంలో తెలియని చిచ్చు ఏదో రగులుతోంది అన్నది అందరికీ తెలిసిందే. నాడు లక్ష్మి పార్వతి విషయంలో ఎన్టీయార్ పడిన ఇబ్బందులే ఇపుడు లోకేష్ విషయంలో చంద్రబాబు ఎదుర్కొంటున్నారు అని కూడా అంటున్నారు. బాబు మరోసారి సీఎం కావాలని ఇప్పటికే టీడీపీలో అంతా కోరుకుంటున్నారు. ఆయన నాయకత్వాన పనిచేసేందుకు ఎవరికీ ఎటువంటి అభ్యంతరాలు కూడా లేవుట. కానీ ఆయన ప్లేస్ లోకి సీఎం సీటులోకి లోకేష్ వస్తాను అంటేనే పార్టీకి అదే పెను ముప్పుగా మారుతుంది అంటున్నారు. తాజాగా వైరల్ అయిన అచ్చెన్న వీడియోలో ఆయన అసంతృప్తి అంతా లోకేష్ మీదనే అన్నది కూడా వెల్లడైంది అని చెబుతున్నారు. తిరుపతి లోక్ సభ ఉప ఎన్నికల ప్రచారానికి అచ్చెన్నాయుడు వచ్చినపుడు ఆయనకు తిరుపతి ఎయిర్ పోర్టులో బీసీ సీఎం కొందరు పార్టీ నేతలు అతి ఉత్సాహంతో నినాదాలు చేశారని ఆ మధ్య ప్రచారం అయితే సాగింది. మరి దాని వెనక కధా కమామిషూ ఏంటో తెలియదు కానీ టీడీపీలో చంద్రబాబు కనుక వీక్ అయితే లోకేష్ కాదు బీసీ నేతకే ముఖ్యమంత్రి పదవి దక్కాలన్నది పార్టీలో చాలా మంది అనుకుంటున్నారు అని తెలుస్తోంది. ఇక లోకేష్ నాయకత్వం మీద ఆయన దీక్షా దక్షతల మీద సీనియర్లకు పెద్దగా నమ్మకాలు లేవు అని కూడా అంటున్నారు. పార్టీలో లోకేష్ పెత్తనానికి వ్యతిరేకంగా గళం విప్పే వారు కూడా ఇక మీదట పెరుగుతారు అంటున్నారు. తిరుపతి ఉప ఎన్నికల ఫలితం తేడా కొట్టినా టీడీపీ కి వచ్చే ఓట్లు దారుణంగా తగ్గినా తెలుగుదేశంలో లోకేష్ టార్గెట్ గా రాజకీయ ప్రకంపనలే మొదలవుతాయని అంటున్నారు. మరి అచ్చెన్న ఏ ఆలోచనా లేకుండా అలవోకగా వీడియోలో లోకేష్ మీద కామెంట్స్ చేసి ఉండరు అన్నది కూడా గట్టిగా వినిపిస్తున్న మాట.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

అనంతపురం, ఏప్రిల్ 16, ప్రజాపాలన ప్రతినిధి:లయన్స్ క్లబ్ - అనంతపురం - ఎలైట్ మరియు వేద ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ ఆధ్వర్యంలో ఈ ఆదివారం 18-04-2021 న మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడమైనది. ఈ వైద్య శిబిరానికి కిమ్స్ సవేరా ఆధ్వర్యంలో గుండెహౌ మరియుహౌ ఆర్థోపెడిక్ రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించిహౌ అనుభవం కలిగిన వైద్యులచేహౌచికిత్స చేయబడును. జి.ఆర్.బి.ఎస్ ,హౌ 2డి, ఇసిజి , బి.పీ, షుగర్ పరీక్షలు ఉచితంగా చేయబడును. హృద్రోగులు, మరియు ఆర్థోపెడిక్ సమస్యలు ఉన్నవారు వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాల్సిందిగాహౌకోరడమైనది.హౌ నూతన క్లబ్ ఆవిష్కరణ భాగంగాహౌ స్థానిక వైభవ్ రెసిడెన్సీ, బళ్లారి చౌరస్తా నందు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం ఉంటుందనిహౌ ప్రధానహౌకార్యదర్శి లయన్ వైష్ణవ శ్రీనాథ్హౌ మరియు కోశాధికారి లయన్ బాయినేనిహౌనాగేంద్ర ప్రసాద్ తెలిపారు.

## ఏపీ అమూల్ పాలవెల్లువ ప్రాజెక్ట్ విస్తరణ

(మొదటి పేజీ తరువాయి)

డబ్బులు కూడా ఎక్కువ వస్తున్నాయి. రైతులు కూడా సంతోషంగా ఉన్నారు. మేం చాలా సంతోషంగా ఉన్నాం. ఈ డెయిరీ మా ఊరిలో పెట్టడం వల్ల అందరం సంతోషంగా ఉన్నాం. అన్ని పథకాలు మాకు అందుతున్నాయి అంతే కాకుండా రైతుల కోసం మీరు చేసే ప్రతీ పథకం వల్ల రైతులందరూ సంతోషంగా ఉన్నాం. మీరు మహిళా సంక్షేమం కోసం మీరు పెడుతున్న పథకాలు మాకు అందుతున్నాయి. పుట్టినింటిలో పొందే ఆనందం మెట్టినింటిలో కూడా పొందుతున్నాం. చాలామంది రైతులు ముందుకొచ్చి మేం కూడా మీ డెయిరీలో పాలు పోస్తాం అంటున్నారు. మీరు చేస్తున్న సాయానికి ఎలా కృతజ్ఞతలు చెప్పాలో మాటలు రావడం లేదు. మాకు ఒక్క అన్నలా మీరు సాయం చేస్తున్నారు. మీకు రుణపడి ఉంటాం సీఎంగారు. మా ఊరి తరపున మీకు ధన్యవాదాలు అని ముఖ్యమంత్రితో ఆమె ఆనందాన్ని పంచుకున్నారు. నాదెండ్ల మండలం గొరిజవోలు నుంచి కే. పద్మ అనే మహిళ ముఖ్యమంత్రి తో మాట్లాడుతూ..

నాకు ఇంతకు ముందు మూడు గేదెలు ఉన్నాయి, పాలు అమ్మినా సరైన ధర రాక రెండు అమ్మేశాం ఇప్పుడు ఒకటే ఉంది. మన డెయిరీలో పాలు పోస్తుంటే లీటర్ రూ. 50 నుంచి రూ. 55 పడుతుంది. మా బాబుకు వసతిదీవెన అందింది. నేను డ్వాక్రా సభ్యురాలిని, మాకు డబ్బులు అందాయి. నేను ఇంకొక గేదె కొనుక్కోవాలి అనుకుంటున్నాను. సబ్సిడీ మీద గేదె ఇస్తే లబ్ధిపొందుతాను అని విన్నవించగా సీఎం వైఎస్ జగన్ స్పందిస్తూ మీరు వైఎస్ఆర్ చేయూతలో దరఖాస్తు చేయండి. సంబంధిత అధికారులు మీకు సహాయం చేస్తారని హామీ ఇచ్చారు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి.

## సకాలంలో రైతు భరోసా దరకాస్తులు చేసుకోవాలి



పొన్నూరు ప్రజా పాలన ప్రతినిధి : తొలి విడత రైతు భరోసా మే 13వ తేదీన విడుదల కానున్న నేపథ్యములో ఎప్రిల్ 30 వ తేదీతో ధరఖాస్తు గడువు ముగియనుండడంతో అర్హత ఉండి ఇంకా ధరఖాస్తు చేసుకొనని రైతులందరూ వెంటనే సంబంధిత రైతు భరోసా కేంద్రాలలో రైతు భరోసాకు ధరఖాస్తు చేసుకోవాలని పొన్నూరు సహాయ వ్యవసాయ సంచాలకులు సి.హెచ్.తిరుమలాదేవి తెలియజేశారు. శుక్రవారం స్థానిక నిడుబ్రోలు లోని పొన్నూరు వ్యవసాయ సబ్ డివిజన్ కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. సమావేశములో పొన్నూరు మండల వ్యవసాయ అధికారి బి.ఆదాం బాబు, చేబ్రోలు మండల వ్యవసాయాధికారి పి. సంధ్యా రాణి, చుండూరు మండల వ్యవసాయ అధికారి, అమర్తలూరు మండల వ్యవసాయ అధికారి వి.లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## టెన్నిస్ బాల్ క్రికెట్ జట్టు కెప్టెన్ గా కొచ్చేర




పొన్నూరు, ప్రజా పాలన ప్రతినిధి:ఈ నెల 17 నుండి 20 తేదీ వరకు ప్రకాశం జిల్లా ఒంగోలు లో జరుగు సౌత్ జోన్ టెన్నిస్ బాల్ క్రికెట్ ఛాంపియన్షిప్ కు ఆంధ్రప్రదేశ్ జట్టు కెప్టెన్ గా పొన్నూరు అంబెడ్కర్ కాలనీ కి చెందిన కొచ్చెర శిరీష్ కుమార్ ఎంపికయ్యారు. శిరీష్ గత నెలలో జరిగిన సీనియర్స్ టీం ఛాంపియన్షిప్ లో అద్భుతంగా రాణించగా తనకీ అవకాశం వచ్చింది. శిరీష్ తో పాటు పట్టణానికి చెందిన అక్షిత్ కూడా ఈ పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఆడతారు. శిరీష్ మరియు అక్షిత్ లు ఎంపికవ్వటం పట్ల జిల్లా టెన్నిస్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి మాజీ జాతీయ కబడ్డీ క్రీడాకారుడు జక్కా శ్రీనివాస్, క్రీడాకారుల తల్లిదండ్రులు, ఆయా పాఠశాలల యాజమాన్యాలు పొన్నూరు పురప్రముఖులు అభినందనలు తెలిపారు.

## పోలీసుల అదుపులో పేకాట రాయుళ్లు



బెల్లంకొండ, ప్రజాపాలన ప్రతినిధి:మండలంలోని స్థానిక పోలీసులకు రాబడిన సమాచారం మేరకు ఎమ్మాజీగూడెం గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న 4180/- రూపాయలను స్వాదినం చేసుకోని వారిపై కేసు నమోదు చేయడం జరిగిందని స్థానిక ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు ఈ దాడుల్లో తమ సిబ్బంది పాల్గొన్నరని తెలిపారు

# రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉపాధి కల్పన ఎండమావేనా.. ?

విజయవాడ, ఏప్రిల్ 16, ప్రజాపాలన ప్రతినిధి:గత పర్యాయం ఆంధ్రాలో అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం విశ్వవిద్యాలయాలలో ఏమాత్రం నియామకాలు చేపట్టక కేవలం ప్రకటనలకే పరిమితమైనది, ఉన్న అరకొర ఆచార్య నియామకాలు కేవలం తమ వర్గం వారికే ఇచ్చి అవినీతి నియామకాలకు తెర తీసింది. జెఎన్టియు అనంతపురం, ఆర్జియుకె టి, రాయలసీమ విశ్వవిద్యాలయం, కృష్ణ యూనివర్సిటీ లలో పెద్ద పెట్టున అవినీతిపరులు అందలమెక్కారు. ఇక 2019 లో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆరంభంలో వాలంటీర్ నియామకాలు చేపట్టి ప్రజల మన్నలను పొందినా ఇతర నియామకాలు చేపట్టాక మీన మేషాలు లెక్కిస్తున్నారు. ఇక తెలంగాణాలో టీఆర్ఎస్ ప్రభుత్వం నియామకాల మాటే మరచింది. తెలంగాణాలో నలభై లక్షల మంది పట్టభద్ర నిరుద్యోగులు ఉన్నారు. పి.హెచ్డి , ఎం ఫిల్, ఎంటెక్, ఫార్మా చేసిన వారు లక్షకు పైగా ఉన్నారు. ఇక ఎంసిఏ , ఎంబిఏ డిగ్రీలు చేసిన వారు లక్షకు మించి ఉన్నారు, తెలంగాణలో ఉద్యోగ నియాకపు ప్రకటనలు లేక దశాబ్దం పైగా కావస్తున్నా నిమ్మకు నీరెత్తినట్లు ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. తెలంగాణ సాధించుకున్న, పబ్లిక్ సర్వీసు కమిషన్ ఏర్పాటు చేసుకొని ఏడు సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు ఒక్క పోస్టు భర్తీ చేయకుండా రికార్డుల కెక్కింది. ఇక ఆంధ్రాలో పబ్లిక్ సర్వీసు కమిషన్ అంతా గందరగోళంగా ఉంది ఉన్న చైర్మన్ ఉదయభస్కర్ పని తీరు మీద చాల ఆరోపణలు వచ్చాయి. అసిస్టెంట్ ప్రొఫెస్సర్ నియామకాలు పబ్లిక్ సర్వీసు కమిషన్ ద్వారా పరీక్షలు నిర్వహించినా, ఫలితాలు ఆరునెలలకు ప్రకటించినా నియామకాలు చేపట్టక కాలయాపన చేసారు. పిహెచ్డి ఉమ్మడి ప్రవేశ ప్రకటన 2018 లో ఇచ్చి 2019 లో పరీక్ష నిర్వహించి 2020 లో అడ్మిషన్స్ చేపట్టారు. ఏప్రిల్ 13న పంచాంగముతో పాటు ఉపాధి కల్పనకు సంబంధించి ఒక క్యాలండరు విడుదల చేస్తారని నిరుద్యోగులు భావించారు. ఆర్థిక శాఖ క్లియరెన్సు ఇవ్వలేదని, చాల విశ్వవిద్యాలయాలల్లో రోస్టర్ సరిగా లేదని ప్రభుత్వం తప్పించుకుంది. ఇక కేంద్ర విద్యాసంస్థలలో పరిస్థితి ఇంకా అధ్వాన్నంగా ఉంది. 2014 కు పూర్వం 52 శాతం అధ్యాపకులు ఉంటే ఇప్పుడు కేవలం 38 శాతం అధ్యాపకులతో సరిపెట్టుకోవాలి. క్రొత్తగా వెలసిన ఐ ఐ టి లు ట్రిపుల్ ఐటి లు, ఐఐటిడిఎం, శ్రీ సిటీ లో ఉన్న ట్రిపుల్ ఐ టి, అబ్దుల్ కలాం ఐ టి లోను , అనంతపురంలో వెలసిన కేంద్ర విశ్వవిద్యాలయంలో పర్మనెంట్ ఫ్యాకల్టీ లేరు. రిసెర్చి గ్రాంట్లు విడుదల కాక సంవత్సరాలు గడుస్తుంది. పరిశోధన అన్నది పూర్తిగా విస్మరించారు. ఐఐసిటి, డిఆర్డిఓ, డిఎంఆర్ఎల్, నేషనల్ సర్వే సంస్థ, జినోమ్ ప్రాజె క్టులు నిధులు లేక చతికిలపడ్డా యి. ప్రజా సంఘాలు, విజ్ఞాన వేదిక లు, ఎన్జిఓ లు, ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాలు, నిరుద్యోగ సం ఘాలు మరియు భావస్వరూప్య త ఉన్నన్నిపార్టీలుకలసికట్టుగా పోరాడాలి.

**డా.యం.సురేష్ బాబు, రాష్ట్ర అధ్యక్షులు, ప్రజా సైన్సు వేదిక**



## విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో కరోనా కలకలం

విజయవాడ, ఏప్రిల్ 16, ప్రజాపాలన ప్రతినిధి: మున్సిపల్ కార్పొరేషన్ లో కరోనా కలకలం రేపుతోంది. ఇప్పటికే పలువురు సిబ్బందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయిందని ,కార్పొరేషన్ లోని టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇంజనీరింగ్, విభాగంలో పలువురు సిబ్బందికి కోవిడ్ పాజిటివ్ వచ్చిందని వినికిడి .త్వరలో నగరపాలక సంస్థ తొలి కౌన్సిల్ సమావేశం జరగనుంది. ఇద్దరు కార్పొరేటర్లకు కూడా పాజిటివ్ అని ముసుగులు. దీనితో కౌన్సిల్ సమావేశం నిర్వహణపై సందిగ్ధత నెలకొంది. ముందస్తుగా కార్పొరేటర్లందరికి కోవిడ్ పరీక్షలు చేస్తున్నారు. రిజల్ట్ తర్వాత కౌన్సిల్ సమావేశం వాయిదా పై అధికారులు తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో కరోనా విలయతాండవం చేస్తోంది. మహమ్మారి బారినపడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. గడిచిన 24 గంటల వ్యవధిలో రికార్డు స్థాయిలో కొత్త పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 35,741 కోవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా.. కొత్తగా 5,086 కేసులు నమోదయ్యాయి. తాజా కేసులతో కలిపి ఇప్పటివరకు రాష్ట్రంలో 9,42,135 మంది వైరస్ బారినపడినట్లు ఏపీ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ వెల్లడించింది.

## ప్రజలకు ఇబ్బంది లేకుండా డ్రయినేజి నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలి:ఎమ్మెల్యే






వేటపాలెం, ఏప్రిల్ 16, ప్రజాపాలన ప్రతినిధి: ప్రజలకు ఇబ్బందులు కలగ కుండా డ్రయినేజి నిర్మాణాలపై మూతలు వేయాలని చీరాల శాసన సభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. గురువారం సాయంత్రం ఆయన మండల కేంద్రం అయిన వెటపాలెంలో చాలా కాలంగా నత్తనడక సాగుతున్న డ్రయినేజి నిర్మాణం పనులను పరిశీలించారు. ఆలస్యానికి గల కారణాలను ఇంజనీరింగ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ డ్రయినేజి నిర్మించిన చోట, కల్వర్టులు వేయని చోట, వెంటనే నాణ్యతతో కూడిని మూతలు వేసి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కొన్ని చోట్ల డ్రయినేజి నిర్మాణాలకు విద్యుత్ స్తంభాలు అడ్డుగా ఉన్నందున పనులు నిలిచి పోయినట్లు గుత్తేదారు సమాధానానికి ఆయన స్పందిస్తూ వెంటనే అడ్డుగా ఉన్న స్థంబాల యొక్క సంఖ్యను తెలియ చేయాలని, కొన్ని చోట్ల ఇనుప స్తంబాలు విద్యుత్ షాకు తగిలే విధంగా ఉన్నందున వాటి స్థానంలో సిమెంటు సంబాలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలతో తన వద్దకు శుక్రవారం చీరాలలో జరిగే అధికారుల సమీక్షా సమావేశానికి తీసికొని రావాలని పంచాయితీ కార్యదర్శి బి ప్రసాద్ ను ఆదేశించారు. కొందరు రైతులు డ్రయినేజి సైట్ కట్ లో కలిపిలే కాలుష్యం ఏర్పడుతుందని వినతి పత్రం అంద చేసినట్లు, దానిపై మరో రోజు పూర్తిగా పరిశీలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చీరాల వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, చీరాల మాజీ ఎంపిపి గవిని శ్రీనివాసరావు, పంచాయితీరాజ్ డి ఇ శేషయ్య, ఏ ఇ నాగేంద్రుడు, ఎంపిడివో కె. నేతాజి, గుత్తేదారు మునగపాటి వెంక టేశ్వరరావు, స్థానిక నాయకులు మాజీ సర్పంచ్ మున్నంగి అరుణ కుమార్, మాజీ ఎంపిటిసి ఖదీర్ భాషా, సయ్యద్ షకీల్, షేక్ షమీమ్, బట్ట లీలానంద ప్రసాద్, అందే కృష్ణ, బండ్ల చంద్ర బాబు, అందే శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## యెన్.టి.టి డేటా కు సెయింట్ ఆన్స్ విద్యార్థిని ఎంపిక

వేటపాలెం, ఏప్రిల్ 15, ప్రజాపాలన ప్రతినిధి: ఇటీవల వర్చువల్ పద్ధతిలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో బి.టెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన యెస్. నమీరా, యెన్.టి.టి డేటా సాఫ్ట్ వేర్ కంపెనీకి ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ యస్. లక్ష్మణరావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి ప్రిన్సిపాల్ డాక్టర్ పొగడదండ రవికుమార్ మాట్లాడుతూ గత సంవత్సర కాలముగా కరోనా కారణముగా కార్పోరేట్ కంపెనీల వారు కళాశాలలను సందర్శించి ప్రాంగణ ఎంపికలను నిర్వహించటం ఇబ్బందికరముగా మారిన సందర్భముగా వర్చువల్ పద్ధతిలోనే ఎంపికలు నిర్వహిస్తున్నరన్నారు. యెన్.టి.టి డేటా సాఫ్ట్ వేర్ కంపెనీలో ఎంపికైన తమ విద్యార్థినికి రూ.3.50 లక్షలు వార్షిక వేతనంతో పాటు ఇతర అలలెన్సులు లభిస్తాయన్నారు. ఎంపికైన యెస్. నమీరాను సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ పి హరిణి, ప్లేస్ మెంట్ ఆఫీసర్ యన్. పూర్ణచంద్రరావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు అభినందనలు తెలియజేశారు



# అమెరికా కాల్పుల్లో 8 మంది మృతి



ఇండియానాపోలిస్,ఏప్రిల్ 16, ప్రజాపాలన ప్రతినిధి: అమెరికాలో మళ్లీ కాల్పుల ఘటన జరిగింది. ఇండియానాపోలిస్‌లో ఉన్న ఎయిర్‌పోర్ట్ వద్ద ఓ సాయుధుడు విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఫెడెక్స్ కార్గో డెలివరీ సంస్థ ఆఫీసు వద్ద ఈ ఘటన జరిగింది. ఆ కాల్పుల్లో 8 మంది మృతిచెందారు. సబ్‌మెషీన్ గన్‌తో ఓ ఉన్మాది భీకరంగా కాల్పులు జరిపినట్లు ప్రత్యక్ష సాక్షి ఒకరు తెలిపారు. కాల్పుల్లో గాయపడ్డవారు ప్రస్తుతం హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. తొలుత ఆ షూటర్ పరారీలో ఉన్నట్లు తెలిసినా.. అతను ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు చెప్పారు. అయితే ఎందుకు ఆ సాయుధుడు కాల్పులకు తెగించాడో ఇంకా పోలీసులు నిర్ధారించలేదు. ఈ కాల్పుల ఘటన పట్ల దర్యాప్తు కొనసాగుతున్నది.రాత్రి 11 గంటల సమయంలో కాల్పుల శబ్ధాలు వినిపించినట్లు స్థానికులు చెప్పారు. ఎయిర్‌పోర్ట్ సమీపం వద్ద ఘటన చోటుచేసుకున్నా.. విమానాల రాకపోకలకు ఎటువంటి అంతరాయం కలగలేదని అధికారులు చెప్పారు. కాల్పుల ఘటనపై ఫెడెక్స్ కొరియర్ సంస్థ ప్రకటన జారీ చేసింది. అధికారులకు సహకరిస్తున్నట్లు చెప్పింది. మృతుల కుటుంబసభ్యులకు సంతాపం తెలిపింది.

# దేశం మొత్తానికి ఆక్సిజన్ ఇస్తున్న ఏపీ

## జగన్ ముందుచూపు ఇప్పుడు ప్రాణాలు కాపాడుతుంది



విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి: దేశవ్యాప్తంగా కరోనా విజృంభిస్తున్న సమయంలో.. మహారాష్ట్ర, ఢిల్లీ, ఉత్తరాఖండ్, పంజాబ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో విలయతాండం చేస్తున్న సమయంలో.. ఆస్పత్రుల్లో ఆక్సిజన్ లేక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. మహారాష్ట్రలో అయితే ఆక్సిజన్ కొరత వల్ల 10 మంది కరోనా రోగులు చనిపోయారు. మామూలు రోజుల కంటే.. వెయ్యి రెట్ల డిమాండ్ ఒక్కసారిగా పెరగటంతో.. డిమాండ్ కు తగ్గట్టు సప్లయ్ లేక.. ఆక్సిజన్ అందక కరోనా పేషంట్లు ప్రాణాలు కోల్పోతున్నారు.దేశంలోని ఐదు రాష్ట్రాల్లో ఆక్సిజన్ కొరతను తీరుస్తున్న ఏ రాష్ట్రమో తెలుసా.. ఆంధ్రప్రదేశ్. అవును.. ఏడాది క్రితం లాక్ డౌన్ సందర్భంగా ఆక్సిజన్ సిలిండర్ల కొరతను దృష్టిలో ఉంచుకుని.. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అన్ని రాష్ట్రాల్లో ఆక్సిజన్ ప్లాంట్లు పెట్టుకోవాలని సూచించింది. ఈ క్రమంలోనే ఏపీలోని విశాఖపట్నంలో 100 టన్నుల సామర్థ్యం ఉన్న ఆక్సిజన్ యూనిట్ ప్లాంట్ ను నిర్మించింది ప్రభుత్వం. ఇంత పెద్ద ప్లాంట్ పెట్టినా.. ప్రభుత్వం ఎక్కడా చెప్పుకోలేదు.. ప్రచారం చేసుకోలేదు.. కనీసం ప్రజలకు కూడా తెలియదు.ప్రస్తుతం విశాఖలోని ఈ ఆక్సిజన్ యూనిట్ నుంచి మహారాష్ట్ర, పంజాబ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు ఆక్సిజన్ సిలిండర్ల సప్లయ్ అవుతుంది.

ఇప్పటి వరకు నాగపూర్ కు 40 టన్నుల ఆక్సిజన్ సిలిండర్లు తరలించింది. మిగతా రాష్ట్రాలకు 10 టన్నుల ఆక్సిజన్ పంపించింది. రోజుకు 100 టన్నుల సామర్థ్యం ఉండగా.. రాష్ట్ర అవసరాలను దృష్టిలో పెట్టుకుని.. మిగతాది ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ.. ప్రాణం పోస్తుంది ఏపీ సర్కార్.ప్రస్తుతం ఏపీలోనూ రోజువారీ కేసుల సంఖ్య 5 వేలకు చేరుకోవటంతో.. అప్రమత్తం అయిన సర్కార్.. ఆక్సిజన్ ప్లాంట్ ను పూర్తి స్థాయిలో.. మూడు షిఫ్టుల్లో నడిచేలా సిబ్బంది, ఉద్యోగులను సన్నద్ధం చేస్తుంది. మొదటి ప్రాధాన్యతగా రాష్ట్ర అవసరాలు తీరిన తర్వాత.. మిగతాది అంతా ఇతర రాష్ట్రాలకు తరలించాలని.. అవసరం అయితే సామర్థ్యాన్ని పెంచాలని ఆదేశించింది ప్రభుత్వం.మిగతా అన్ని రాష్ట్రాలు ఈ విషయంపై నిర్లక్ష్యంగా వ్యవహరించాయి. ఏ రాష్ట్రం కూడా ఆక్సిజన్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోలేదు. ఏపీ సీఎం జగన్ ఒక్కరే.. రాబోయే ప్రమాదాన్ని, అవసరాలను గుర్తించి.. అత్యవసరంగా రోజుకు 100 టన్నుల సామర్థ్యంతో ఆక్సిజన్ సిలిండర్ల ప్లాంట్ ను ఏర్పాటు చేసుకున్నారని కేంద్రం మిగతా రాష్ట్రాలకు చురకలు అంటించే వరకు.. ఈ విషయంలో వెలుగులోకి రాలేదు.ఒక్క ఆక్సిజన్ ప్లాంట్ విషయంలోనే కాకుండా.. మాస్క్ లు, శానిటైజర్లు, పీపీఈ కిట్లు, వెంటిలేటర్లను సైతం రాష్ట్రంలో ఉత్పత్తిని పెంచి.. ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే స్థాయికి వచ్చాయి ప్లాంట్లు. కరోనాను ఎదుర్కోవటానికి అవసరం అయిన సామాగ్రి అంతా.. ఏపీలోనే తయారు అవుతుందని.. ఈ విషయాన్ని ఎప్పుడు ప్రకటనలు, భజనతో చెప్పుకోలేదని అంటున్నారు ప్రభుత్వ అధికారులు....




# ప్రజాపాలన

## సంపాదకీయం

శనివారం 17, ఏప్రిల్ 2021

## కాలగర్భంలోకి ఎయిడెడ్ కళాశాలలు, పాఠశాలలు

మహాపండితులు నడయాడిన విజయనగరం ఎమ్మార్ కళాశాల, 'జనగణమన'కు స్వరకల్పన జరిగిన మదనపల్లి బి.టి కళాశాల, విశ్వవిద్యాలయానికి దీటైన ఏలూరు సి.ఆర్.రెడ్డి కళాశాల, బోధివృక్షాలనదగ్గ ఎ.సి., లయోలా కళాశాలలు, విరుద్ధ భావాల సంగమం కావలి జవహర్‌భారతి కాలగర్భంలోకి జారిపోతున్నాయి. ఆంధ్రదేశంలో తొలితరం విద్యాధికులందరికీ జ్ఞానభిక్ష పెట్టిన ఎయిడెడ్ కళాశాలలన్నీ త్వరలో స్మృతిశకలాలుగా మారుతున్నాయి. రాష్ట్రంలో 1347 మంది అధ్యాపకులతో, లక్షాపాతిక వేల మందికి పైగా విద్యార్థులతో 152 డిగ్రీ కళాశాలలుబీ 720 మంది అధ్యాపకులతో, 80వేల మంది విద్యార్థులతో 120 జూనియర్ కళాశాలలు, 7298 మంది ఉపాధ్యాయులతో, రెండున్నర లక్షల మంది పిల్లలతో 3827 పాఠశాలలు ఎయిడెడ్ యాజమాన్యాలవి నడుస్తున్నాయి. రెండు దశాబ్దాలుగా టీచర్ల నియామకాలు నిలిపి వేసినా, ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలు చుట్టుముట్టినా ఇంకా ఇవి నిటారుగా నిలబడేవున్నాయి. ఇప్పుడు ప్రభుత్వం వీటన్నిటికి మంగళం పాడాలని నిర్ణయించింది. ఒక పథకం ప్రకారం 'మీరు ఆస్తులతో సహా మీ సంస్థల్ని ప్రభుత్వానికికైనా అప్పజెప్పండి. ఎయిడ్ ఉపసంహరణనైనా ఎదుర్కోండి' అంటూ ఒక హుకుం జారీచేసింది. యాజమాన్యాలు ఆస్తులు అప్పజెప్పవు గాబట్టి ఆచరణలో జరిగేది ఎయిడ్ ఉపసంహరణ మాత్రమే. ఈ తంతు ముగించడానికి ప్రభుత్వం ఏప్రిల్ 6వ తేదీన ప్రొ. రత్నకుమారిగారి అధ్యక్షతన ఒక కమిటీ వేసి వారం రోజుల్లో నివేదికనిమ్మని కోరింది. ఎయిడ్‌ను ఉపసంహరించుకోడానికి ప్రభుత్వం మూడు కారణాలు చెపుతోంది. ఒకటి విద్యార్థుల ప్రవేశాలు బాగా తగ్గుతున్నాయి. రెండు అధ్యాపకుల వేతనాలు, రెగ్యులరైజేషన్ డిమాండ్లు ఆర్థిక భారంతో కూడుకున్నవి. మూడు యాజమాన్యాలు వీటిని నడపలేకపోతున్నాయి. ఇక మూసివేతే మార్గం కాబట్టి న్యాయపరంగా ఎదురయ్యే సవాళ్ళనెదుర్కొవాలి. దీనికోసం ఈ కమిటీని నియమించింది. ఎయిడెడ్ విద్యాసంస్థలకు గొప్ప చారిత్రక నేపథ్యముంది సామాజిక భూమిక ఉంది. కేరళలో ప్రభుత్వ సంస్థలకంటె ఎయిడెడ్ సంస్థలే ఎక్కువ. ఇవి లేని తమిళనాడు ఉన్నత విద్యను ఊహించుకోలేం. కర్ణాటకలోని మఠాలు మహావిద్యా సంస్థలుగా ఎదిగి, అట్టడుగు వర్గాలకు అక్షరబిక్ష పెట్టడం ఒక ధర్మంగా పాటిస్తున్నాయి. జాతీయోద్యమ వారసత్వంగా పుట్టిన ఎయిడెడ్ విద్యాసంస్థలు మత సామాజిక దాతృత్వ సేవా సంస్థల చొరవతో దేశమంతటా విస్తృతంగా అల్లుకుపోయాయి. అద్భుతమైన మౌలిక వసతులు సమకూర్చుకోగలిగాయి, విస్తృత సామాజిక మద్దతు లభించడంతో మహావృక్షాలుగా ఎదిగాయి. నియామకాల్లో రాజకీయ బ్యురాక్రటిక్ జోక్యాలకు, సంక్లిష్ట నిబంధనలకు తావులేకపోడంతో యాజమాన్యాలు గొప్ప విద్వాంసుల్ని, మేధావుల్ని ఎంపిక చేసుకోగలిగాయి. సమర్థంగా నడపగలిగాయి. అకడమిక్ స్వేచ్ఛనివ్వగలిగాయి. ఈ దృష్టితో చూస్తే ప్రస్తుత వ్యాపార కార్పొరేట్ సంస్థలకూ వీటికీ పోలికే లేదు. ప్రభుత్వ సంస్థలు వెలిశాయి. ఆ ప్రాంత ప్రజల విద్యావసరాల్ని తీర్చాయి. అందువల్ల ప్రభుత్వం అక్కడ పాఠశాలల్ని, కళాశాలల్ని పెట్టే అవసరం రాలేదు. ఇప్పుడు వీటిని మూసెయ్యడమో, అన్‌ఎయిడెడ్ ప్రైవేటు (వ్యాపార) సంస్థలుగా మార్చడమో జరిగితే ఈ ప్రాంతపు పేదపిల్లలేమవుతారు? ఇవి మంచి హాస్టళ్ళను నడుపుతున్నాయి. దూరం నుంచి పేదపిల్లలు, మరీ బాలికలు వేలమంది వీటిలో ఉండి కలంపోటుతో దాదాపు పాతికవేల ఎయిడెడ్ పోస్టులు రద్దవుతాయి. ప్రభుత్వ సంస్థల్లోని ఖాళీల్ని భర్తీ చెయ్యడం శాశ్వతంగా వాయిదా పడుతుంది. ఇక మిగిలింది రెగ్యులరైజ్ అవుతామని ఎదురుచూస్తూ వెట్టిచాకిరీ చేస్తున్న 2000 మంది అన్‌ఎయిడెడ్ అధ్యాపకులు. ప్రభుత్వం వీరిని తన ఉద్యోగులే కాదంటోంది. చిమ్మచీకటి తప్ప వీళ్ళకేమీ మిగిలేలా లేదు. ఇక 'బిలియన్' డాలర్ల కూడా వీటి దరిదాపులకు చేరలేవు. ఒక్కసారి టిటిడి పద్మావతి మహిళా కళాశాలనో, విజయవాడ స్టెల్లా కాలేజీనో గుర్తుకు తెచ్చుకోండి. ఇలాంటివి ఒక్కటంటే ఒక్కటైనా ప్రభుత్వం నడపగలదా? ఒక్క ప్రాచ్య కళాశాలనైనా ప్రభుత్వం పెట్టగల్గిందా? దేశంలో ఎక్కడా లేనట్టు తెలుగునాట మాత్రమే ఎయిడెడ్ విద్యాసంస్థలెందుకు శల్యావశిష్టంగా మారాయి? దీనికి ప్రభుత్వాలు పనిగట్టుకొని చేసిన రాజకీయ విధ్వంసమే కారణం. ఈ ధ్వంసరచన 1999%--%-2005 మధ్య పరాకాష్టకు చేరింది. ఒక ప్రభుత్వం ప్రపంచబ్యాంకుతో ఒప్పందంలో భాగంగా ఎయిడెడ్ పోస్టుల భర్తీని నిలిపేసింది. నియామకాల్లో అవకతవకలు, కోర్టు జోక్యాలు లాంటి సాకుల్ని అడ్డం పెట్టుకొని మరో ప్రభుత్వం ఇదే విధానాన్ని కొనసాగించింది. మధ్యలో చాలా ఆందోళనలు జరిగాయి. చర్చలు నడిచాయి. అధ్యయనాలు సాగాయి. రేషనలైజేషన్ చేసి పోస్టులు భర్తీ చేద్దామన్న ఆలోచన కూడా ముందుకొచ్చింది. కానీ ఒక్కడుగూ ముందుకు పడలేదు. దీంతో పాఠశాలలు కళాశాలలు మన తెలుగు రాష్ట్రాల్లో కోలుకోలేని దెబ్బతిన్నాయి. ఎయిడెడ్ విద్యాసంస్థలు ఒక చారిత్రక సందర్భంలో కొన్ని ప్రత్యేక ప్రదేశాల్లో చదువుకొంటున్నారు. ప్రభుత్వం వీటికి ఏ ప్రత్యామ్నాయం చూపగలదు? ఎయిడెడ్ విద్యాసంస్థల్లో ఏ లోపాలూ లేవని గాదు. కొత్త కోర్సులతో ప్రజల సమకాలీన ఆకాంక్షలకు తగ్గట్టుగా మారలేకపోవడం వీటి మొదటి లోపం. దీంతో కార్పొరేట్ ప్రైవేటు సంస్థల పోటీకి వితట్టుకోలేకపోయాయి. యాజమాన్యాల స్వభావంలో, దృక్పథంలో కూడా చాలా మార్పులొచ్చాయి. కొత్త వారసులకు ఆస్తులమీద మక్కువ ఎక్కువైంది. సమర్థంగా నడపడం మీద ఆసక్తి తగ్గింది. అన్నిటికంటె మించి అన్‌ఎయిడెడ్ ఉపాధ్యాయుల వేతనాలు వీరికి భారమైపోయాయి. చిన్ని చిన్న స్కూళ్ళ అవసరం మరీ తగ్గిపోయింది. నియామకాలు లేక అధ్యాపకుల సంఖ్య నానాటికీ కుదించుకుపోయింది. కళ్ళముందే తమ వ్యవస్థ కనుమరుగవుతున్నా కన్నీళ్ళు గుక్కుకోడం తప్ప వీళ్ళేమీ మాట్లాడలేకున్నారు. ప్రభుత్వ వ్యవస్థలోకి మారితే గౌరవప్రదంగానైనా బ్రతకొచ్చుననే స్థితికొచ్చారు. కానీ అదీ అంత సజావుగా జరిగేలా లేదు. వీళ్ళని పోస్టులతో సహా తీసుకోబోమని, ఖాళీల్లో సర్దుబాటు మాత్రమే చేస్తామని, వీలినమవుతామనే భ్రమలు పెట్టుకోవద్దని ప్రభుత్వం చెపుతోంది. దీంతో ఒక్క మార్క్ ప్రశ్న వీటి ఆస్తులది. నగరాల నడిబొడ్డున ఎయిడెడ్ సంస్థలకు బంగారంలాంటి భూములున్నాయి. సువిశాల భవనాలున్నాయి.

యుజిసి, రూసా నిధులతో సమకూరిన మంచి మౌలిక వసతులున్నాయి. వీటి విలువ వేల కోట్లలో వుంటుంది. ఇవన్నీ ఈ సంస్థలకు ఎలా సంక్రమించాయో ఎక్కడా రికార్డులు లేవు. వీటిలో తొంభైశాతం దాతలు, ప్రభుత్వాలు సమకూర్చినవి. లాభాపేక్ష లేకుండా విద్యాభివృద్ధికి తోడ్పడాలని, పేదలకు జ్ఞాన భిక్షపెట్టాలని అందజేసినవి. ప్రస్తుత యాజమాన్యాలకు వీటితో ఏ సంబంధమూ లేదు. ప్రభుత్వం ఎయిడ్ ఉపసంహరించుకొన్న మరుక్షణం యాజమానులకు వీటిపై సర్వాధికారాలు సంక్రమిస్తాయి. ఆ తర్వాత ఏం జరుగుతుందో మనకంటే ప్రభుత్వానికే బాగా తెలుసు! ఇప్పుడు మన ముందున్నవి రెండు ప్రశ్నలు. ఒకటి దేశంలో ఎక్కడా లేనట్టు ప్రభుత్వం ఈ నిర్ణయం ఎందుకు తీసుకుందనేది మొదటి ప్రశ్న. 'ఎంత బలహీనపడ్డా ఎయిడెడ్ విద్యాసంస్థల్ని పునరుజ్జీవింపజేసే మార్గమే లేదా' అనేది రెండో ప్రశ్న. మొదటి దాన్ని పక్కనబెట్టి వాస్తవిక దృష్టితో రెండో ప్రశ్నకు సమాధానం వెతుకుదాం. ఎయిడెడ్ కళాశాలల్లో పాఠశాలల్లో కొన్నిటికి కాలం చెల్లిన మాట వాస్తవం. చిన్న చిన్న ప్రాథమిక పాఠశాలలు, మంచి ప్రభుత్వ పాఠశాలల ప్రక్కనే ఏ వసతుల్లేకుండా కునారిల్లుతున్న పాఠశాలలు, వ్యక్తులు కుటుంబాలు బతుకుతెరువు కోసం నడుపుతున్న సంస్థలు ఈ కోవలోకి వస్తాయి. వీటి అవసరం ఇక లేకపోవచ్చు. మిషనరీలు, దాతృత్వ సేవా సంస్థలు చరిత్రగల్గిన యాజమాన్యాలు నానాకష్టాలు పడి నడుపుతున్నవి, అన్ని హంగులు కలవి రెండోరకం. వీటికి కేరళలోలాగా సాయమందిస్తే, పోస్టులు భర్తీచేస్తే అత్యున్నత విద్యాసంస్థలుగా విరాజిల్లుతాయి. ప్రభుత్వ, కార్పొరేట్ సంస్థలేవీ వీటికి సాటిరాలేవు. ఇక దేవాదాయశాఖ భవనాల్లో ఆస్తులతో నడుపుతున్న సంస్థలు. తిరుమల తిరుపతి దేవస్థానం విద్యా సంస్థలతో పాటు వీరేశలింగంగారి సంస్థలు ఈ తరగతిలోకి వస్తాయి. వీటిని నేరుగా ప్రభుత్వమే నడుపవచ్చు. ఆధునికంగా తీర్చిదిద్దవచ్చు, మంచి సేవాసంస్థలకో, సొసైటీలకో అప్పజెప్పనూవచ్చు. చివరగా నియామకాల విధివిధానాల్లో కూడా మార్పులు రావాలి. అందరితో చర్చించి యాజమాన్యాల స్వేచ్ఛకు భంగం కలగకుండానే ఒక పారదర్శక విధానాన్ని రూపొందించాలి. యాజమాన్యాలు కూడా తమ ధోరణి మొత్తం ఎయిడెడ్ వ్యవస్థకే ముప్పు తెస్తోందని గుర్తించాలి. ఇప్పుడు కావల్సింది ఒక సానుకూల దృక్పథం, దార్శనికత. వ్యవస్థల్ని కూల్చెయ్యడం సులువు. పునరుద్ధరించడం చాలాకష్టం. భారతదేశ విద్యారంగంలో ఇప్పటికీ ఎయిడెడ్ వ్యవస్థకు కాదనలేని స్థానం ఉన్నదని ప్రభుత్వం, సమాజం రెండూ మనసారా నమ్మాలి. ఈ నమ్మకం ఉంటే పునరుజ్జీవనం పెద్ద సమస్యే కాదు.

# కాదేదీ జీఎస్టీకి అనర్హం!

వస్తుసేవల పన్ను (జీఎస్టీ) నుంచి అంతిమంగా ఏ వస్తువుకు, ఏ సేవకు, బహుశా మినహాయింపు ఉండదేమో?! పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తీసుకు వచ్చే ప్రతిపాదన పరిశీలనలో ఉన్నట్టు ఆర్బీఐ (రిజర్వ్బ్యాంక్ ఆఫ్ ఇండియా) గవర్నర్ శశికాంత్ దాస్ వెల్లడించారు. దీనివల్ల ప్రభుత్వం తొలుత ఆదాయాన్ని కోల్పోవలసివచ్చినప్పటికీ దీర్ఘకాలంలో అమితంగా లబ్ధి పొందగలుగుతుందని ఆయన ఉద్ఘాటించారు. పెట్రోలియం ఉత్పత్తులపై జీఎస్టీ విధించడం వల్ల ప్రభుత్వానికి తొలి దశలో లక్ష కోట్ల రూపాయల మేరకు ఆదాయ నష్టం సంభవించవచ్చని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా నివేదిక ఒకటి అంచనా వేసింది. మరి ఈ లక్ష కోట్ల రూపాయల ఆదాయ నష్టాన్ని ఎక్కడ నుంచి, ఎలా భర్తీ చేస్తారు? వస్త్రాలు, కాగితాలు, బైక్‌లు, ఇతర వస్తువులపై విధించే పన్నుల నుంచి ఆ మొత్తాన్ని సమకూర్చుకుంటారు. మరింత స్పష్టంగా చెప్పాలంటే పెట్రోలియం ఉత్పత్తులను జీ ఎస్టీ పరిధిలోకి తీసుకురావడమనేది పన్నుల తగ్గింపునకు దారితీయదు. పెట్రోలియం ఉత్పత్తుల నుంచి ఇతర వస్తువులకు మాత్రమే పన్నులను మార్చడం సంభవిస్తుంది. ఇది అనివార్యం కూడా. మనం వినియోగించుకుంటున్న చమురులో 85 శాతాన్ని దిగుమతి చేసుకుంటున్నామనేది మనం విస్మరించలేని, విస్మరించరాని వాస్తవం. చమురుపై పన్ను తగ్గింపు వల్ల దాని ధర తగ్గుతుంది. ధర తగ్గుదలతో వినియోగం పెరుగుతుంది. అనివార్యంగా చమురు దిగుమతులూ పెరుగుతాయి. ఇది అంతిమంగా మన ఆర్థిక సార్వభౌమత్వానికి ఒక సవాల్ గా పరిణమిస్తుంది. చమురు వినియోగాన్ని పెంచుకోవడానికి బదులుగా తగ్గించుకోవల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనివల్ల చమురు దిగుమతులపై మనం తక్కువగా ఆధారపడతాము. పెట్రోలియం ఉత్పత్తులను జీ ఎస్టీ పరిధిలోకి తీసుకురావడం ద్వారా వాటిపై పన్ను తగ్గింపు పూర్తిగా వ్యతిరిక్త పరిస్థితులకు దారితీస్తుంది. మనం మరింతగా చమురు దిగుమతులపై ఆధారపడడం అనివార్యమవుతుంది. ప్రస్తావిత అంశాల నేపథ్యంలో పెట్రోలియం మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన ఒక కీలక ప్రకటనను మనం అర్థం చేసుకోవలసి ఉంది. పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావడం వల్ల చమురు రంగం ఇతోధిక అభివృద్ధికి దోహదం జరుగుతుందని ఆయన ప్రకటించారు. సౌర ఫలకాలను ప్రతిష్ఠాపితం చేసుకోవడం కంటే ఒక డీజిల్ జనరేటర్‌ను ఏర్పాటు చేసుకోవడమే లాభదాయకమని పారిశ్రామిక వేత్తలు భావించే అవకాశం ఉంది. మరి మనం చమురు రంగం అభివృద్ధిని కోరుకొంటున్నామా? లేక సౌరశక్తి రంగం పురోగతిని అభిలషిస్తున్నామా? ఇదీ ఇప్పుడు మన ముందున్న ప్రశ్న. ఇంతకు ముందే చెప్పినట్టు చమురు వినియోగం పెరుగుదల ప్రతికూల ఫలితాలకు దారితీస్తుంది. మార్గాంతరమేమిటి? చమురు వినియోగం నాణ్యతను మెరుగుపరచుకోవడమే. సౌరశక్తి, పవన విద్యుత్తు మొదలైన ప్రత్యామ్నాయ ఇంధన వనరులకు ఆస్కారం లేని చోట్ల పెట్రోలియం ఉత్పత్తులను వినియోగించుకోవడం ఒక ఉపయుక్త పరిష్కారం. ఇక్కడ ఒక స్వీయానుభవాన్ని చెబుతాను. 1980 దశకంలో మా ఇంటిలో ఏర్పాటు చేసుకునేందుకు ఒక చిన్న 500వాట్ పెట్రోల్ జనరేటర్‌ను కొనుగోలు చేశాను. అప్పట్లో సౌర ఫలకాలు చాలా హెచ్చు రేట్లలో మాత్రమే లభ్యమయ్యేవి. గృహావసరాలకు వాటినేర్పాటు చేసుకోవడమనేది లాభసాటి ప్రత్యామ్నాయం కాదు. అయితే ఇప్పుడు మా ఇంటిలో పెట్రోల్ జనరేటర్ స్థానంలో ఒక 240 వాట్ సౌర ఫలకాన్ని ఏర్పాటు చేసుకున్నాను. అప్పటికీ ఇప్పటికీ సౌర ఫలకాల ధర గణనీయంగా తగ్గగా పెట్రోల్ ధర భారీగా పెరిగింది మరి. ఇదే విధంగా పెట్రోల్ ధర మరింతగా పెరిగితే పట్టణాలు, నగరాలలోని ప్రయాణికులు పెట్రోల్‌తో నడిచే ప్రైవేట్ వాహనాలపై కాకుండా విద్యుత్‌తో నడిచే మెట్రోలపై ఆధారపడతారు.




పెట్రోలియం ఉత్పత్తులను ప్రజల ప్రయాణాలకు, సుదూర ప్రాంతాలకు సరుకుల రవాణాకు మాత్రమే ఉపయోగించుకోవడం అన్ని విధాల శ్రేయస్కరం. ఈ రవాణా కార్యకలాపాలను సౌర శక్తి, పవన విద్యుత్ మొదలైన ప్రత్యామ్నాయ ఇంధన వనరులతో నిర్వహించడమనేది అసాధ్యం. పెట్రోలియం ఉత్పత్తులను వస్తుసేవల పన్ను పరిధిలోకి తీసుకురావడం వల్ల తక్షణ పర్యవసానమేమిటి? దేశవ్యాప్తంగా పెట్రోల్ మొదలైన వాటికి ఒకే ధర వసూలు చేస్తారు. పారిశ్రామిక వేత్తలు ఒక ఫ్యాక్టరీని నెలకొల్పడంపై నిర్ణయం తీసుకోవడంలో చమురు ధరను పరిగణనలోకి తీసుకోవల్సిన అవసరం ఉండదు. దీనివల్ల పారిశ్రామిక వేత్తలు తమ వనరులను ఇంకా ఇతర కార్యకలాపాలకు మరింత సమర్థంగా, ప్రయోజనకరంగా కేటాయించేందుకు వెసులుబాటు లభిస్తుంది. అయితే అదే సమయంలో పెట్రోలియం ఉత్పత్తులపై వసూలు చేయవలసిన వ్యాట్ (వ్యాల్యూ యాడెడ్ ట్యాక్స్- వస్తుసేవల ధరకు అదనంగా కలిపే పన్ను)పు నిర్ణయించడంలో రాష్ట్రాలకు గల స్వతంత్ర ప్రతిపత్తిని తొలగిస్తుంది. ఈ పరిణామాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సహజంగానే సుతరామూ అంగీకరించవు. ప్రస్తుతం కొన్ని రాష్ట్రాలు అధిక రేట్లతో పన్నులు వసూలు చేస్తున్నాయి. తద్వారా లభించే ఆదాయాన్ని అడవుల సంరక్షణ, నీటి పారుదల వసతుల అభివృద్ధి, టీకాలు వేయడం లేదా శాంతి భద్రతలను మరింత పటిష్ఠంగా నిర్వహించడం మొదలైన ప్రజా శ్రేయో కార్యకలాపాలకు వినియోగిస్తున్నాయి. మరి కొన్ని రాష్ట్రాలు పెట్రోలియం ఉత్పత్తులపై వసూలు చేస్తున్న వ్యాట్ రేట్ స్వల్ప స్థాయిలో మాత్రమే ఉంటోంది. కారణమేమిటి? వ్యాట్ రేట్, చమురు ధరలు స్వల్ప స్థాయిలో ఉండడం వల్ల తమ రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పేందుకు పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహకరంగా ఉంటుందని పలు రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తున్నాయి. ప్రజలకు సైతం మంచి ఆదాయం సమకూరుతుందని, జీవన ప్రమాణాలు మెరుగుపడతాయనేది రాష్ట్ర పాలకుల ఆశాభావం. వ్యాట్‌ను అటు హెచ్చు స్థాయిలో, ఇటు స్వల్ప స్థాయిలో వసూలు చేసే విధానాలు రెండూ సమర్థనీయమే. అధిక పన్నులతో సమకూరే అధికాదాయం, ప్రజా సదుపాయాల పై భారీ వ్యయాలు ప్రజా సంక్షేమానికి విశేషంగా దోహదం చేస్తాయి. అలాగే తక్కువ పన్నులు, వ్యాపారవేత్తలు, పారిశ్రామిక వేత్తలను మరింతగా ప్రోత్సహించడం కూడా జనక్షేమానికి తోడ్పడుతాయి. అయితే పన్నుల రాబడిని సమర్థంగా వినియోగించే రాష్ట్రాల ప్రజలు అధిక వ్యాట్ వసూలుతో విశేషంగా లబ్ధి పొందుతారుబీ రాబడిని దుబారా చేసే రాష్ట్రాల ప్రజలు అధిక వ్యాట్ మూలంగా నష్టపోతారు. వ్యాట్ విషయంలో స్వతంత్ర ప్రతిపత్తి రాబడిని సమర్థంగా వ్యయపరిచేందుకు రాష్ట్రాలకు ఒక ప్రోత్సాహకంగా ఉంది. అధిక వ్యయాల మూలంగా మీరు పలు ప్రయోజనాలను పొందగలుగుతారని పన్ను చెల్లింపుదారులకు రాష్ట్ర ప్రభుత్వం చెప్పగలుగుతుంది. ఈ విధంగా వ్యాట్ స్వతంత్ర ప్రతిపత్తి, ఆదాయాన్ని సమర్థంగా వినియోగించేందుకు రాష్ట్రా ప్రభుత్వాలను కచ్చితంగా పురిగొల్పుతుందనడంలో సందేహం లేదు.

## నిజమైన సంపద మానవత్వం..

పెద్దపెద్ద భవంతులు, ఎకరాలకొద్దీ పొలాలు, విలాసవంతమైన జీవితం, ఖరీదైన వాహనాల్లో ప్రయాణం, డబ్బును విచ్చలవిడిగా ఖర్చు చేయడం సంపదగా పరిగణిస్తాం. డబ్బుతోనే గొప్పతనం, గౌరవం వస్తాయనే ఆలోచన కొంతవరకు వాస్తవమే అయినా నిజమైన సంపద ఇది కాదు! మనిషి ఏదైనా సాధించడానికి శరీరమనే ఉపాధి కావాలి. ఇది ఉన్నంతవరకే మనమేమి చేయాలనుకున్నా, ఏ లక్ష్యాన్ని చేరాలనుకున్నా సాధ్యమయ్యేది. అందువల్ల దీన్ని జాగ్రత్తగా పోషించుకోవాలి. అందుకే పెద్దలు ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు. ఇహపర సాధనకు సాధనం ఈశరీరమే. కష్టకాలంలో మన పక్కన స్నేహితులను కలిగి ఉండటమన్నది, ఎంతో గొప్ప సంపద. సంస్కారవంతులుగా, జ్ఞానవంతులుగా మనల్ని తీర్చిదిద్దేది చదువు. విచక్షణ, వివేకాలనే చక్షువులనిచ్చి మనిషిని సన్మార్గంలో పయనించేటట్లు చేస్తుంది. తన పుట్టుకకు ఇతర ప్రాణుల పుట్టుకకు భేదాన్ని తెలుసుకునే మేధనిస్తుంది. ఈ సకల చరాచర సృష్టిలో తన స్థానాన్ని, ప్రాముఖ్యాన్ని, కర్తవ్యాన్ని మనిషికి బోధపరచేది చదువే. అది చాలా విలువైన సంపద. మనిషి ఒంటరిగా జీవించలేడు. ఎదుటివారితో ఎలా మసలుకోవాలో, ఎలా సంభాషించాలో ప్రథమంగా తన కుటుంబ సభ్యులనుంచి, తన పెద్దలనుంచి గ్రహించాలి. వారి సత్ప్రవర్తనను అలవరుచుకోవాలి. అది సమాజంలో తోటివారితో ప్రవర్తించే తీరుపై ప్రతిబింబించి సత్ఫలితాలనిస్తుంది. సంబంధ, బాంధవ్యాలను నిలుపుకొనే విధంగా మన ప్రవర్తన ఉండాలి. అప్పుడే మన బంధాలు హాయిగా సాగిపోతాయి. అందరినీ కలుపుకొనే స్నేహపూర్వక ప్రవర్తన మనకు ఐశ్వర్యం లాంటిదే. సంపదంటే ధనాన్ని ఎక్కువగా సంపాదించడం కాదు. మంచినీళ్లప్రాయంగా ఖర్చు చేయడం అంతకన్నా కాదు. అలాగని ఎక్కువగా పొదుపు చేయడమూ కాదు! సంపాదన ఒక స్థాయికి చేరుకున్న తరవాత ఇక సంపాదించవలసిన అవసరంలేదన్న భావన కలగడం. దాన్నే తృప్తి అంటారు. అది మనిషికి కలగనినాడు అశాంతికి గురవుతాడు. మనశ్శాంతి కరవవుతుంది. కంటిమీద కునుకే ఉండదు. తృప్తి కొంతమందికే దక్కే అరుదైన సంపద. తమ సృజనతో అద్భుతమైన రచనలు చేసేవారు, నిష్ణాతులైన కళాకారులు, రోగుల ప్రాణాలు కాపాడే వైద్యులు, ప్రయోగశాలలో అహరహం పరిశోధనలు చేస్తూ మానవాళికి ఉపకరించే అనేక వస్తువులకు రూపకల్పన చేసే శాస్త్రవేత్తలు, భావితరాలను బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దే అధ్యాపకులు, ఎన్నో ప్రతికూల పరిస్థితుల్లో దేశాన్ని రక్షించే సైనికులు... ఏ దేశానికైనా విలువైన సంపద. మహాపురుషులందించిన జ్ఞానసంపద, మన పూర్వీకులందించిన విజ్ఞానం, పెద్దలు మనకోసం ఏర్పరచిన సదాచారాలు, సత్సంప్రదాయాలు, మన జీవితానికొక క్రమశిక్షణను, పథాన్ని ఇస్తాయి. వాటిని పాటిస్తూ, వారు చూపిన ధర్మపథంలో కొనసాగడమే ఆ వారసత్వ సంపదకు మనమివ్వగలిగే నిజమైన గౌరవం. అది ఘనమైన సంపద. దాస్యశృంఖలాలను బద్దలుచేసి దేశమాతకు స్వేచ్ఛా ఊపిరులూదడంలో తమ ధన, మాన, ప్రాణాలను కోల్పోయిన ఎందరో త్యాగధనులు తరతరాలు మనసులో నిలుపుకోవలసిన వారు. వారు జాతికి అమూల్యమైన సంపద. 'మనిషి కడవరకు తోడు ఉండాల్సిదేమిటి?' అని యక్ష ప్రశ్నల్లో యక్షుడు ధర్మరాజును అడుగుతాడు. మనోబలమని సమాధానమిస్తాడు యుధిష్ఠిరుడు. మనవెంట ఎవరున్నా, ఎంత సంపద ఉన్నా మనోబలానికి సాటిరావు. మనిషి తుదిశ్వాస వరకు ఉండవలసిన ఈ సుగుణం ఎంతో అద్భుత సంపద. సంపద అనగానే మనకు వచ్చే లౌకిక దృష్టి, భావనల నుంచి బయటపడి నిజమైన సంపదను గుర్తెరగాలి. జీవితానికొక ఔన్నత్యం చేకూరేదప్పుడే!.

**రావుల రాజేశం,**
**జమ్మికుంట, 9848811424.**

# నమ్మశక్యం కాని ప్రాణాలను కాపాడే మొక్క

**"మొక్కే కదా అని పికేస్తే పీక కోస్తా" ఇది ఒక చిరంజీవి సినిమాలోని ఒక డైలాగ్. కాని ఇక్కడ కనిపిస్తున్నది ప్రాణాలను కాపాడే మొక్క. నమ్మశక్యం కాకపోయినా ఇది నిజం. చూడటానికి ఇది కేవలం రోడ్డు మద్యలో మొలిచిన కేవలం ఒక చిన్న మొక్క.**



కృష్ణాజిల్లా మచిలీపట్నం బ్యూరో ఛీఫ్ (ప్రజాపాలన) : కృష్ణాజిల్లా మచిలీపట్నం పరాసుపేట లోని ప్రాధాన కూడలిలో రోడ్డుమద్యలో మొలిచిన ఈ చిన్న మొక్క చూపరులకు ఇది చూడటానికి ఒక పిచ్చి మొక్కలాగానే కనిపిస్తుంది. కాని ఈ మొక్కవల్ల ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో వివరాలలోకి వేల్తేగాని తెలియదు. సుమారుగా రెండు సంవత్సరాల క్రితం వాటర్ పైప్ లైన్ వేయడానికి ప్రధాన కూడలి మద్యలో సిమెంటు రోడ్డు తవ్వి మరీ పైపు లైన్ వేశారు. పైపు లైను వేయడం పూర్తయ్యింది కాని ఈ రోడ్డు మద్యలో గుంత పూడ్చడం మరిచిపోయిన అధికారులు. ఇదే ప్రధాన కూడలి వెంబడి నిత్యం అధికారులు (రెవిన్యూ డివిజనల్ అధికారి, జిల్లా పోలీసు సుపరిండేంట్ మరియు ఇతర అధికారులు) ప్రయాణం చేస్తూ ఉంటారు. కొన్నిరోజులపాటు ఈ గుంటలో ఎవరు పడిపోకుండా కర్రలు పాతారు, అవికాస్త విరిగిపోయి కాలగర్భంలో కలిసిపోయాయి. ఇది ఒక ప్రధాన కూడలి కావడం ఒక ఎత్తైతే మరొక ప్రధాన అంశం రోడ్డు మద్యలో మలుపులో ఉండటం వలన నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా ఏ ఒక్కరూ పట్టించుకునే ప్రయత్నం చేయలేదు. అధికారులకు కనువిప్పు కలిగించాలి అనుకుందో ఏమో ప్రకృతే మొక్క రూపంలో రోడ్డు మద్యలో వెలిసింది. సరిగ్గా గుంటకు అంచున మొలిచిన ఈ మొక్క ఎన్నో జీవితాలను కాపాడగలుగుతుంది. రెండు సంవత్సరాలు గడుస్తున్నా ప్రధాన కూడలిలో తవ్వి వదిలేసిన ఈ గుంటను పూడ్చడానికి అధికారులకు సమయం కుదరడం లేదు అంటే అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు అని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఇప్పటికైనా ప్రక్రుతి ప్రాసాదించిన మొక్క స్థానంలో వదిలేసిన కొద్దిపాటి గుంటను పూడ్చి పౌరుల ప్రాణాలను కాపాడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.







## "కరోనాని జయించిన" డాక్టర్ భాస్కర్ రావు

**శుక్రవారం విధుల్లోకి హాజరైన బాపట్ల కోవిడ్ ఇన్ చార్జీ" డాక్టర్ భాస్కర్ రావు**

బాపట్ల ప్రజాపాలన ప్రతినిధి :కరోనాపై పోరులో ఎడతెగని శ్రమలో తల మునకలై విధి నిర్వహణలో అనుక్షణం బాపట్ల ప్రజలకు అందుబాటులో ఉంటూన్నారు ... సుమారు ఏడాది కాలంగా కుటుంబానికి దూరంగా ఉంటూన్నారు ... "బాపట్ల కోవిడ్ ఇన్ చార్జీ" గా విశేష సేవలందించిన డాక్టర్ భాస్కర్ రావు, కరోన సెకండ్ వేవ్ లో వైరస్ బారిన పడ్డారు. కరోనాని జయించి, పూర్తిగా కోలుకున్న ఆయన శుక్రవారం విధుల్లోకి హాజరు కావటంతో, బాపట్ల పిపి యూనిట్ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమం లో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాశాల వైద్యాధికారి డాక్టర్ సిద్దార్ధ, ల్యాబ్ టెక్నీషియన్ సత్యంరాజు,పీపీ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

## 850 అక్రమ మద్యం బాటిల్స్ పట్టివేత-బెల్లంకొండ ఎస్ఐ రాజశేఖర్



బెల్లంకొండ,ఏప్రిల్ 16, ప్రజాపాలన ప్రతినిధి: మండలంలోని గోపాలపురం అడవి ప్రాంతంలో శుక్రవారం తెల్లవారుజామున గుంటూరు రూరల్ ఎస్పీ ఆదేశాల అనుసారం రాబడిన సమాచారం మేరకు స్థానిక ఎస్ఐ రాజశేఖర్ తన సిబ్బందితో గోపాలపురం అడవి ప్రాంతంలో అనుమానాస్పదంగా వెళ్తున్న ఒక ఆటో నీ వెంబడించగా ఆటో లో ఉన్న వ్యక్తి ఆటో నీ వదిలి పారి పోవడం జరిగింది ఆటో ని తనిఖీ చేయగా అందులో 850 అక్రమ మద్యం బాటిల్స్ (180%ఎశ్రీ% )కోటర్ బాటిల్స్ స్వాధీనం చేసుకోవడం జరిగింది దీని విలువ సుమారు లక్షా 40 వేల 225 రూపాయలు ఉంటుందని తెలిపారు పారిపోయిన వ్యక్తిని 1 %ఁ% 2రోజులలో అరెస్టు చేసి రిమాండ్ కు పంపడం జరుగుతుందని తెలిపారు ఎవరైనా అక్రమ మద్యం తెచ్చిన అమ్మిన అసాంఘిక చర్యలకు పాల్పడితే తమ యొక్క మొబైల్ నెంబర్ 9440796237 తెలియపరచాలని తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వేణు హనుమంతరావు నారాయణ అనిల్ షరీఫ్ రామారావు నాయక్ పాల్గొన్నారు.

## లిరంజాన్ మొదటి శుక్రవారం ప్రార్ధనలు నిర్వహించుకున్న ముస్లిం సోదరులు

బెల్లంకొండ :(ప్రజా పాలన ప్రతినిధి) మండలంలోని బెల్లంకొండ నంది రాజుపాలెం న్యూ చిట్యాల పాపయ పాలెం వన్నాయపాలెం గ్రామాలలో రంజాన్ నెల మొదటి శుక్రవారం మసీదులలో ముస్లిం సోదరులు ప్రార్థనలు నిర్వహించుకున్నారు %ఎశీజఱఎ% -19 నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరూ సమ దూరాన్ని పాటిస్తూ మొఖానికి మాక్స్ ధరించి ప్రార్థనలు నిర్వహించుకున్నారు బెల్లంకొండ మసీదులో మౌలానా మొహమ్మద్ అబ్దుల్ రఫీ మాట్లాడుతూ రంజాన్ నెలలో చేయు ఉపవాస దీక్షల గురించి నమాజులు గురించి అలనాడు ప్రవక్తలు ఏ విధంగా ఆచరించారో హదీసు లో ఏం రాయబడిందో క్లుప్తంగా వివరించారు నమాజు అంటే ఏమిటి ఉపవాస దీక్షలు ఎందుకుండాలో వివరముగా ముస్లిం సోదరులకు తెలియపరిచారు ప్రతి ఒక్కరూ రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేపట్టాలని అదే విధముగా ఐదు పూటల నమాజులు తరావీహ్ నమాజ్ తహజ్జుద్ నమాజ్ ను ఆచరించాలని వీటన్నిటికన్నా తల్లిదండ్రులను ఇహలోకంలో సుఖసంతోషాలు పెడితే వారి యొక్క పుత్రులకు ఆ అల్లాహ్ హుతాల పరలోకములో స్వర్గాన్ని ఇస్తాడని తెలియపరిచారు ఈ కరోన మహమ్మారి పై మనమందరం పోరాడాలని పిలుపునిచ్చారు అదే విధముగా కరోనా మహమ్మారి కీ గురైన సోదరులు త్వరగా కోలుకోవాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు

# నా ఆరోగ్యము -నా బాధ్యత

**-మీడియా సోదరులకు మందులు పంపిణీ**






బెల్లంకొండ: (ప్రజా పాలన ప్రతినిధి) మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సోదరులకు నా ఆరోగ్యం నా బాధ్యత పై అవగాహన సదస్సు డాక్టర్ ఆర్ శ్రీనివాస్. ఆయుష్ వైద్య అధికారి నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ఎం పి డి ఓ డీజే నాయక్ తహసిల్దార్ టీ. మస్తాన్ హాజరయ్యారు డీజే నాయక్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పైన మరియు కోవిడ్19 కోవిడ్ టీకా ,,ఆయుష్ సంవాద్, ' ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత కోవిడ్ నిబంధనలు పాటించవలని వారు కోరారు. బయటకు వెళ్ళేటప్పుడు ప్రతి ఒక్కరూ మాక్స్ ధరించాలని పోయి ఇంటికి వచ్చినప్పుడు శానిటైజర్ తో గాని సబ్బుతో గాని చేతులు శుభ్రంగా కడుక్కోవాలి అని సూచించారు తాసిల్దార్ టీ. మస్తాన్ మాట్లాడుతూ కరోనా సెకండ్ వేతో మనమందరం బాధ్యతగా ఉండాలని నా ఆరోగ్యము -నా బాధ్యతగా ప్రతి ఒక్కరూ ఉండాలని ప్రతి ఒక్కరు ముఖానికి మాస్క్ ధరించాలని చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సమదూరం పాటించాలని వారు కోరారు ఆయుష్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ నలుమూలల నుండి వార్తలు సేకరించు వారే విలేకరులే ననీ విలేకరులు లేకుంటే సమాజంలో ఏం జరిగిందో ఏం జరుగుతుందో తెలియడం కష్టం అని చెప్పారు 60 సంవత్సరాల వయసు్సు దాటిన వారందరూ కోవిడ్ టీకా తప్పకుండా చేయించుకోవాలని 45 సంవత్సరాల నుండి 59 సంవత్సరాల మధ్య ఉండి దీర్ఘకాల కాలంగా మధు మేహము. అధిక రక్తపోటు .గుండె సంబంధిత వ్యాధులు .క్యాన్సర్. ఊపిరితిత్తుల వ్యాధులు. కండర సంబంధిత వ్యాధులు. కాలేయ సంబంధిత వ్యాధులు. రక్త సంబంధిత వ్యాధులు. హెచ్ఐవి వ్యాధి ఉన్నవారు అందరూ తప్పకుండా కోవిడ్ టీకా చేయించుకోవాలని సూచించారు వ్యాధి. నిరోధక శక్తిని పెంచడానికి చావన ప్రాశ్ లేహాము . శంశన వటి. విలేకరులకు స్థానిక తాసిల్దార్ సిబ్బందికి పంపిణీ చేయడం జరి గిందని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్ బాలకృష్ణ స్థానిక మండల ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సోదరులు మండల రెవిన్యూ సిబ్బం ది మండల పరిషత్తు సిబ్బంది పాల్గొన్నారు

## తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పల్లెల సీతారామి రెడ్డి అంతిమ యాత్రలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ శ్రేణులు





రొంపిచర్ల,ఏప్రిల్ 16, ప్రజాపాలన ప్రతినిధి:రొంపిచర్లలో మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పల్లెల సీతారామి రెడ్డి గారు నిన్న సాయంత్రం మరణించారు. విషయం తెలుసుకున్న నరసరావుపేట నియోజకవర్గ తెదేపా నేత డా??చదలవాడ అరవింద బాబు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. శుక్రవారం జరిగిన అంత్యక్రియలు ఘనంగా జరిగాయి. సీతారామిరెడ్డి భౌతికకాయం పై టిడిపి నాయకులు వెన్న సాంబశివ రెడ్డి,రొంపిచర్ల మండల పార్టీ అధ్యక్షులు వెన్న బాలకోటి రెడ్డి,కొల్లి బ్రహ్మయ్య, కోడెల అబ్బాయా టిడిపి జెండా కప్పి నివాళులర్పించారు. ఆయన మృతదేహాన్ని కొద్దిదూరం మోసి తన అభిమానాన్ని చాటుకున్నారు. సీతారామిరెడ్డితో తనకున్న అనుబంధమును గుర్తు తెచ్చుకున్నారు. ఆయన మృతదేహాన్ని ట్రాక్టర్ పై గ్రామంలో ఊరేగించి శ్మశానం వరకు తీసుకెళ్ళి అనంతరం కుటుంబ సభ్యులు,బంధువులు,అభిమానుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. జోహార్ సీతారామిరెడ్డి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మెట్టు వెంకటేశ్వరరెడ్డి,పులుకురి జగ్గయ్య,కల్లి శివారెడ్డి,కల్లి మల్లారెడ్డి,కోనేటి శ్రీను,మాదినీడి అంజయ్య,పూదోట సునీల్ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.లి

## వ్యాక్సిన్ పై పొదుపు గ్రూపు మహిళలకు అవగాహన కల్పించాలి: ఏపిఎం



వేటపాలెం, ఏప్రిల్ 16, ప్రజాపాలన ప్రతినిధి : కరోనా వ్యాక్సిన్ పై పొదుపు గ్రూప్ మహిళలకు అవగాహన కల్పించాలని ఏపిఎం బూదాటి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం డిఆర్డిఏ వేటపాలెం అధ్వర్యంలో స్థానిక మండల కాంప్లెక్స్ లో నిర్వహించిన కరోనా నియంత్రణ, వ్యాక్సిన్ పై అవగాహన కార్యక్రమానికి ఆయన అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ కరోనా వ్యాక్సిన్ అందరూ వేయించుకోవాలని, అంతేకాక ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని ఏదైనా సైడ్ ఎఫెక్ట్స్ గాని, చిన్న చిన్న సమస్యలు ఉన్నా మేమున్నామని భరోసా ఇవ్వడమే కాక, పొదుపు గ్రూపు మహిళలందరూ కూడా ఈ వ్యాక్సినేషన్లో పాల్గొని ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఏపీఎం మాట్లాడుతూ ఎన్ఆర్ఎల్ఎం ఇండియా ద్వారా భారతదేశం మొత్తం పొదుపు గ్రూపు సభ్యులే అవగాహన సదస్సులు నిర్వహించి నివారణ మరియు వ్యాక్సిన్ మీద అవగాహన ప్రజల్లో కల్పిస్తున్నారన్నారు. ప్రతి గ్రామ సంఘంలో మీటింగ్ నిర్వహించి, ప్రతి ఒక్కరు కోవిడ్ నిబంధనలు పాటించాలని, మాస్కులు ధరించాలని, వ్యాక్సిన్ వేయించుకోవాలని తెలియజేయాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమం రెండు రోజుల పాటు జరుగుతుందన్నారు. వివోఏ లకు మరియు గ్రామంలో యాక్టివ్ గా ఉన్నటువంటి మహిళలకు ఈ రోజు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వివో ఏలు, ఏపీఎం శ్రీనిధి కామేశ్వరి, కన్నయ్య గారు, సిసి లు పాల్గొనడం జరిగింది.

# స్త్రీలకు సమానత్వం కల్పించాలి



విశాఖపట్నం ఏప్రిల్ 16 ప్రజాపాలన ప్రతినిధి : పౌరగ్రందాలయం పూలే అంబేడ్కర్ రాజ్యాధికారసమితి (పిఆర్ఎస్ )ఆహ్వానం " మహిళా సమానత్వం 50/ రిజర్వేషన్ల ఆవశ్యకత "చర్చా వేదిక తరుపున ఆత్మగౌరవ పరిరక్షణ మన లక్ష్యం -రండి కదలిరండి పిలిపునిచ్చారు అన్నిటీలో స్త్రీలుకు సమాన సమానత్వం అవకాశలు కల్పించాలని వేముయంత మాకుయంత ని దానిమీద ఆడవాళ్లుకు మగవాళ్ళుతో సమాన అవకాశలు అన్నింట్లోను ముందు వుండాలి ఈదేశంలో అన్ని రంగంలో పాలించే దిశలో అధికారం లో వాటాలో సిడబ్యుసి, మెంబెర్ మోడరేటర్ డా,, గూడూరు సీతామహాలక్ష్మీ అధ్యక్షతన జరిగింది, పిఓడబ్యు అధ్యక్షులు లక్ష్మి అక్క, ప్రొఫిసర్ మంజులత, పార్స్ విశాఖపట్నం కమిటీ మెంబెర్ సీనియర్ అడ్వాకేట్ సోషల్ యాక్టవిస్ట్ జహాఆరా, సోషల్ యాక్టివిస్టు మహిళా లీడర్ స్రవంతి, పార్స్ కమిటీ మెంబెర్ సీనియర్ అడ్వేకెట్,కె, కళావతి, అంబేడ్కర్ టీవీ డైరెక్టర్ పీయం, రాజు, మరో డైరెక్టర్ పున్నారావు, ఇందిరా, రూపవతి, వరలక్ష్మి బాలనాగమ్మ, ఈశ్వరి, పార్స్ సీడబ్యుసీ ఆరుకు పార్లమెంట్ కమిటీ లీడర్, జికె, బాబూ, మోహన్ రావు కె సుబ్బారావు,పూలే అంబేడ్కర్ విజ్ఞాన కేద్రం అధ్యక్షులు, సీడబ్యుసీ కమిటీ మెంబెర్, రౌతు గోపి, ఎన్, మోహరావు కార్యక్రమం కు హాజరయ్యారు.



# అంబేద్కర్ 130వ జయంతి ఉత్సవాలు





విశాఖపట్నం, ఏప్రిల్ 16 ప్రజాపాలన ప్రతినిధి : అంబేద్కర్ భవనం లో ప్రపంచ విశ్వ విజేత, పీడిత ప్రజల విముక్తిప్రదాత మానవ హక్కుల యోధుడు,గొప్ప దర్శినికుడు,బాబా సాహెబ్ డా,, బి ఆర్, అంబేద్కర్ 130 వ జయంతి మహోత్సవంలు ఉదయం 8 గంటలకు ఎల్ ఐ సి వద్దఉన్న అంబేద్కర్ విగ్రహం కు పూల దండాలు తో ప్రారంభించి ఘనంగా నివాళులు అర్పించారు, సాయంత్రం నాలుగు గంటలకు అంబేద్కర్ విగ్రహం నుండి భారీ ఊరేగింపు డప్పులు వాయిద్యాలతో కల గజ్జెలతో జనచైతన్యమండలి కళాకారులూ బృందం వారు అంబేద్కర్ పాటలు తో ఊరుతులు, హోరు ఏంతించే నినాదాలతో బహుజనలు, ఈ జయంతి పండుగ లో బయిలుదేరి జగదాంబ మీదగా కాంప్లేక్స్ నుండి అంబేద్కర్ భవనం వరకు ఊరేగింపుగ అనంతరం సాయంత్రం జరిగే అంబేద్కర్ సభ కు అజరైరు ఈ సభ అంబేద్కర్ మెమోరియల్ సోసైటీ విశాఖపట్నం వారి ఆధ్వర్యంలో ఎర్పాటు చేశారు. ఈ కార్యక్రమకు అధ్యక్షులుగ, ఏ ఎం ఎస్, అధ్యక్షులు ఇంటి గురుమూర్తి, అధ్యక్షత వహించారు, ఏ ఎం ఎస్, ప్రధాన కార్యదర్శి పరువు రాజేశ్వరరావు, ప్రారంభం ఉపన్యాసం చేశారు ముఖ్య వక్తగా ఆంధ్ర విశ్వవిద్యాలయం అంత్రోపాలజీ ప్రొఫిసర్ సత్యపాల్ అంబేద్కర్ గార్ని గొప్పగ కొనియాడారు, విశాఖపట్నం జిల్లా కోర్టు సీనియర్ న్యాయవాది గంట మోహనరావు, మాట్లాడారు. ఏ ఎం స్, పూర్వ అధ్యక్షులు ప్రస్తుత గౌరవ అధ్యక్షులు బొడ్డు కళ్యాణరావు, డి ఐ టి యు ట్రేడ్ రాష్ట్ర నాయుకులు బాలభాస్కరావు, ఉపన్యాసంచారు, ఈకార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ కార్యవర్గం సభ్యులు అద్భుతంగ జరిపించారు అంబేద్కర్ భవనం జీవితకల సభ్యులు, అంబేద్కర్ రైట్స్ మానవత వాదులు జిలాల్లో వున్నా బహుజన కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు

## వేసవిలో నాణ్యమైన విద్యుత్ అందజేయాలి



వేటపాలెం, ఏప్రిల్ 16, ప్రజాపాలన ప్రతినిధి: వేసవిలో ఎండలు తీవ్రత దృష్ట్యా నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందజేయాలని చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి విద్యుత్ అధికారులకు ఆదేశించారు. చీరాల పురపాలక సంఘ సమావేశపు హాలులో శుక్రవారం ఎమ్మెల్యే బలరాం విద్యుత్, మంచినీరు, రహదారులు, గృహ నిర్మాణం తదితర అంశాలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా మున్సిపాలిటీ, చీరాల, వేటపాలెం మండలాల ప్రజలు ఆయనకు పలు సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ తరచుగా నియోజకవర్గంలో విద్యుత్ అంతరాయం, లోఓల్టేజీ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలియజేశారని, ఇకపై కరెంట్ సమస్యలు లేకుండా ఉండేలా చూడాలని విద్యుత్ అధికారులను కోరారు. దానిపై విద్యుత్ అధికారులు సమాధానమిస్తూ స్థానిక సమస్యల వలనే అంతరాయం ఏర్పడుతుందని, సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఇకపై నిరంతర విద్యుత్‌ని అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, జిల్లా కరెంట్ ఎస్ఈ కేవిజీ సత్యనారాయణ, మున్సిపల్ కమీషనర్ పి. ఏసయ్య, పంచాయతీరాజ్ డిఈ శేషయ్య, చీరాల, వేటపాలెం ఎంపీడీఓలు సాంబశివరావు, నేతాజీ, చీరాల తహసీల్దార్ మహమ్మద్ హుస్సేన్, ఆర్డబ్ల్యుఎస్, హౌసింగ్, పలు శాఖల అధికారులు, వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సాయిల్ సైన్స్ పై పుస్తకావిష్కరణ

హైదరాబాద్: సాయిల్ సైన్స్ పై ఈటల సత్యనారాయణ రాసిన పుస్తకాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ఓఎస్‌డి, ఫారెస్ట్ కాలేజీ అండ్ రీసెర్చ్ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌సిఆర్ఐ) డీన్ ప్రియాంకా వర్గీస్ శుక్రవారం ఆవిష్కరించారు. సాయిల్‌సైన్స్‌పై పరిశోధనలుచేస్తున్న వారికి, జాతీయ స్థాయి పోటీపరీక్షలకు హాజరయ్యే వారికి సమగ్ర సమాచారం ఇందులో లభిస్తుందని రచయిత తెలిపారు. అలాగే సాయిల్ సైన్స్‌ను అర్థం చేసుకుని ఫారెస్ట్, ఫారెస్ట్ ప్రొడక్టవిటీని వృద్ధి చేసేందుకు ఈ పుస్తకం దోహదం చేస్తుందన్నారు. పుస్తక సహ రచయిత, ఎఫ్‌సిఆర్ఐ వీసీ, అండ్ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా ఈ పుస్తకాన్ని ఇటీవల దివంగతులైన ఎఫ్‌సిఆర్ఐ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. సుమన్ బయ్యానీకి అంకితం ఇచ్చారు.

# రెల్లి కులస్థులపై దాడి నేపథ్యంలో కంబాల జోగులు పర్యటన





విశాఖపట్నం ఏప్రిల్ 16 ప్రజాపాలన ప్రతినిధి : శ్రీకాకుళం జిల్లా రాజాం మండలం గురవారం రెల్లికులస్థలపై దాడి చేసిన నేపధ్యంలో రాజాం నియోజకవర్గ శాసనసభ్యులు కంబాల జోగులు గారు పర్యటించాలి దళితులను ఓదార్చాలి వారికి అండగా నిలబడాలని దాడి చేసినఅగ్రకుల పేతందార్లును తక్షణమే %ంఎ/ ర్% అట్రాసిటీ చట్టం ప్రకారం అరెస్టు చేయాలని జిల్లా దళిత సంఘాలు రౌండ్ టేబుల్ సమావేశంలో డిమాండ్ చేశారులి ఈ రోజు ఉదయం 11.30 గంటలకు నవోదయ మోడల్ స్కూల్ పాలకొండ లో జిల్లా దళిత సంఘాలు ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా బహుజన ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బొత్స బుద్ధుడు,సమత సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షులు దేబారికి రామప్పడు మాట్లాడుతూ గురవా%శీ% రెల్లికులస్తల పై దాడి జరిగి వారం రోజుల కావస్తున్నా నింతుతుల్ని అరెస్ట్ చేయకుండా పీతాందార్లకు పోలీసు యంత్రాంగం కొమ్ముకాయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. గ్రామంలో నేటికి అంటరానితనం, కులవివక్ష వంటి సామాజిక రుగ్మతలు కొనసాగడం చాలా అన్యాయమని, గతంలో కసింవలస లో మలాలను కొట్టారు, గోసాం లో మాదిగలను కొట్టారు, ఇప్పుడు గురావం లో ఆదపాక లో రెల్లిలను కొట్టడం చూస్తే దళితుల పట్ల వారి అభివృద్ధి పట్ల ఈ ప్రభుత్వానికి గాని అధికారులకు గాని చిత్తశుద్ధి లేదని విమర్శించారు, గురవం దళితుల పై దాడులు విషయంలో బిసిలు పై దళితులే దాడి చేశారు అని పాలకొండలో 130 వ అంబేద్కర్ జయంతి రోజున డిసిసిబి మాజీ చైర్మన్ పాలవలస విక్రాంత్ గారు వ్యాఖ్యలు చేయుడాన్ని చాలా తీవ్రంగా ఖండించారు తక్షణమే ఆ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు ఈ దాడులు నేపథ్యంలో దళితులు అంతా ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి డి గణేష్, కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య, సీనియర్ దళిత నాయుకులు కొంచాడ జాన్, రెల్లికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏసుబాబు, %ఖఫూా% జిల్లా సహాయ కార్యదర్శి దూసి దుర్గారావు, మాలమహా సమితి జిల్లా అధ్యక్షుడు కోట గణేష్,పిన్నింటి బాలరాజు, జమ్మన ప్రసాద్,కుప్పిలి మీరమ్మ, బడాన మహేష్, గురవం రెల్లి ఆత్మగౌరవ పోరాట కమిటీ కో కన్వీనర్ బొత్స మోహన్, ముద్దాడా దాలిప్పుడు ఆదిలక్ష్మి, నందిని, భవానమ్మ,రమేష్, హరి,లక్ష్మణ్, బి మంజుల, ఆర్ ప్రభ,కుప్పిలి సరోజిని,కుప్పిలి రూతి,రాగోలు వరలక్ష్మి, రాగోలు మంజుల, రాగోలు రాము,సిరిపురంపు గురువులు, నల్లబారికి గురుమూర్తి, వి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# చిరంజీవికి కాంగ్రెస్సే ..మైనస్సా..!



విజయవాడ, ఏప్రిల్ 16, ప్రజాపాలన ప్రతినిధి:దక్షిణాదిన తిరుగులేని నటుడు సూపర్ స్టార్ రజనీకాంత్. ఆయనది నాలుగున్నర దశాబ్దాలకు పైగా సినీ జీవితం. సౌతిండియా దిగ్దర్శకుడు కె బాలచందర్ కళ్ళలో ఒకనాడు పడి కెమెరా ముందు నిలిచిన సామాన్య ఆర్టీసీ కండక్టర్ ప్రపంచ నటుడి స్థాయిని సంపాందించారంటే అది ఆయన స్వయంకృషిగానే చెప్పుకోవాలి. రజనీకి దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు రావడాన్ని అంతా స్వాగతిస్తున్నారు, ఆనందిస్తున్నారు. కానీ తమిళనాట ఎన్నికల సమయంలో ఈ అవార్డ్ దక్కడం పట్ల మాత్రం కొంత చర్చ అయితే ఉంది. రజనీకాంత్ కి ఎన్నో అవార్డులు ఇప్పటికే దక్కాయి. ఆయనకు పద్మభూషణ్ వచ్చింది. 2016లో పద్మ విభూషణ్ దక్కింది. కేంద్రంలోని బీజేపీ సర్కార్ పెద్దలకు దేశాన సినీ ప్రముఖులు అంటూ గుర్తుకు వస్తే ఉత్తరాన అమితాబ్ దక్షిణాన రజనీకాంతే గుర్తుకు వస్తారు. తాజాగా 75 ఏళ్ల స్వాతంత్ర వేడుకల సన్నాహక కమిటీలో కూడా రజనీకి చోటు కల్పించారు. అదే సమయంలో తెలుగు రాష్ట్రాలో నంబర్ వన్ స్టార్ గా ఉన్న మెగాస్టార్ చిరంజీవిని మాత్రం మరిచారు. చిరంజీవికి కాంగ్రెస్ హయాంలో పద్మభూషణ్ దక్కింది. ఆ తరువాత ఆయన ప్రజారాజ్యం పార్టీని పెట్టి తన సత్తా ఎంత ఉందో చెప్పేసేలా గుప్పిట విప్పేశారు. ఇక తన పార్టీని కాంగ్రెస్ లో కలిపేసి ఆ పార్టీ తరఫున కేంద్ర మంత్రిగా పనిచేశారు ఇక రాజ్యసభ పదవీకాలం ముగియగానే ఆయన సినిమా రంగానికే పరిమితం అయ్యారు. చిరంజీవి తమ్ముడు పవన్ కళ్యాణ్ బీజేపీతో దోస్తీ చేస్తున్నా చిరంజీవి మాత్రం నో పాలిటిక్స్ అంటున్నారు. బహుశా ఆ గుస్సా ఏమైనా కేంద్ర బీజేపీ పెద్దలకు ఉందేమో తెలియదు అన్న మాట ఉంది. అర్హత ఉంటే అవార్డులు వచ్చి వాలిపోవు. దానికి తోడు రాజకీయ అవసరాలు కూడా ఉండాలి. అవి పై వారికి తీర్చేలా ఉండాలి. రజనీకాంత్ బలం ఎంటో ఇప్పటికీ ఎవరికీ తెలియదు. ఆయన పార్టీ పెట్టకుండానే రాజకీయ ఊహాగానాలకు స్వస్తి చెప్పారు దాంతో పాటు ఆయన ఏ పార్టీ మనిషిగా ముద్ర లేకుండా ఉన్నారు. మరో వైపు ఆయన మీద బీజేపీకి ఆశలు ఇంకా చాలానే ఉన్నాయి. ఇవన్నీ కలసి దేశంలోనే ఒక అత్యున్నత పురస్కారానికి ఆయన్ని ఎంపిక చేసేలా చూసాయని అంటున్నారు. అదే సమయంలో మరో వైపు చిరంజీవి మాజీ కాంగ్రెస్ నేతగా ఉన్నారు. బీజేపీని టచ్ మీ నాట్ అంటున్నారు. ఈ నేపథ్యంలో కనీసం ఆయనకు పద్మ విభూషణ్ కూడా దక్కలేదు అన్న చర్చ అయితే ఉంది. ఏది ఏమైనా అదే తమిళనాడుకు చెందిన మాజీ సీఎం ఎంజీ రామచంద్రన్ కి భారత రత్నను సరిగ్గా ఎన్నికల వేళ నాటి కాంగ్రెస్ సర్కార్ ప్రకటించంది. ఇపుడు మరో తమిళ నటుడు రజనీకి కూడా బీజేపీ అవార్డును ఎన్నికల వేళనే చూసి మరీ అందించింది. మరి తెలుగునాట ఒక ఎన్టీయార్, మరో చిరంజీవి ఏం పాపం చేశారు అంటే సమాధానం కేంద్ర పెద్దలే చెప్పాలేమో.

# శ్రీధరన్ గెలుపు అంత ఈజీ కాదు



తిరువనంతపురం, ఏప్రిల్ 16, :సాధారణ పరిస్థితుల్లో అయితే పాలక్కాడ్ నియోజకవర్గం గురించి పెద్దగా చెప్పుకోవలసింది అంటూ ప్రత్యేకంగా ఏమీ ఉండదు. దక్షిణాది రాష్ట్రమైన కేరళలోని 140 అసెంబ్లీ స్థానాల్లో అదొకటి. అంతకు మించి ఏమీ లేదు. అయితే ఎప్పుడైతే మెట్రో శ్రీధరన్ ఇక్కడి నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగారో ఈ నియోజకవర్గం ఒక్కసారిగా వార్తల్లోకెక్కింది. అందరి చూపు అటు వైపు మళ్లింది. 88 సంవత్సరాల శ్రీధరన్ ఎన్నికల్లో పోటీ చేయడమే విశేషమైతే కనీస పునాదులు లేని పార్టీ అయిన బీజేపీ ఆయనను తమ ముఖ్యమంత్రిగా ప్రకటించడం మరో విశేషం. దీంతో ఇక్కడి గెలుపోటములు, పార్టీల బలాబలాలపై చర్చ సాగుతోంది. ఒకప్పుడు పాల్ ఘాట్ గాపిలిచే ప్రస్తుత పాలక్కాడ్ లో త్రిముఖ పోటీ జరుగుతోంది. శ్రీధరన్ ను యూడీఎఫ్ (యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్) తరఫున సిట్టింగ్ కాంగ్రెస్ శాసనసభ్యుడు షఫీ పారాంబిల్, ఎల్డీఎఫ్ (లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్) తరఫున సీపీఎం అభ్యర్థి సీపీ ప్రమోద్ ఢీకొంటున్నారు. దేశంలో మెట్రో రైళ్లకు రూపకర్త అయిన శ్రీధరన్ ను పెద్దాయనగా తాము గౌరవిస్తామని, అంతమాత్రాన ఆయనను తేలిగ్గా తీసుకోబోమని, ఓడించి తీరుతామని కాంగ్రెస్, సీపీఎం అభ్యర్థులు చెబుతున్నారు. శ్రీధరన్ సైతం అదే విషయాన్ని స్పష్టం చేస్తున్నారు. తన వయసులో సగం కూడా లేని, తన కుమారుల వయసు గల ప్రత్యర్థులను తేలిగ్గా తీసుకోబోమని, ఓడించి తీరుతానని, తన సత్తా ఏమిటో చాటుతానని పేర్కొంటున్నారు. ఇటీవల పాలక్కాడ్ ప్రెస్ క్లబ్ లో జరిగిన మీట్ ది ప్రెస్ లో కార్యక్రమంలో ఒకే వేదికపైన ఆశీనులైన ఈ ముగ్గురు నేతలు పైకి చిరునవ్వులు చిందించినప్పటికీ తెరవెనక గెలుపు వ్యూహాల రచనలో తీరిక లేకుండా ఉన్నారు. పాలక్కాడ్ లో కాంగ్రెస్ అభ్యర్థి షఫీ పారాంబిల్ 2011, 2016ల్లో గెలిచారు. సిటింగ్ ఎమ్మెల్యేగా చురుగ్గా వ్యవహరిస్తారన్న పేరు గల షఫీ ప్రచారంలో దూసుకుపోయారు. ఇంధన, గ్యాస్ ధరల పెంపుతో మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తున్న మోదీ పార్టీకి ప్రజలు తగినవిధంగా బుద్ధి చెబుతారని షఫీ అంటున్నారు. ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేసిన సీపీఎం ఇప్పుడూ అదే పనితీరును కనబరుస్తుందన్న ధీమాను సీపీఎం అభ్యర్థి ప్రమోద్ కనబరుస్తున్నారు. మెట్రో శ్రీధరన్ కూడా తనవైన లెక్కలు చెబుతున్నారు. విజయం తనదేన్న విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఆయన ఆషామాషీగా బరిలోకి దిగలేదు. అన్నీ అంచనాలు వేసుకునే తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. కేరళలో నెమోమ్ తరవాత కమలం పార్టీకి మంచి పునాది గల నియోజకవర్గం పాలక్కాడ్. 2016 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి శోభ సురేంద్రన్ 40,076 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. అప్పట్లో కాంగ్రెస్ అభ్యర్థి షఫీ 17,483 ఓట్ల మెజార్టీతో విజేతగా నిలిచారు. ఇటీవల జరిగిన పాలక్కాడ్ మున్సిపల్ ఎన్నికల్లోకాషాయ పార్టీ ఇక్కడ విజయ కేతనం ఎగురవేసింది. మొత్తం 52 వార్డులకు ఆ పార్టీ 29, యూడీఎఫ్ 10, సీపీఎం 6 వార్డులను కైవశం చేసుకున్నాయి. అంతే కాక పథనం తిట్ట జిల్లాలోని పందలం పురపాలక సంఘాన్నీ బీజేపీ తన ఖాతాలో వేసుకుంది. మొత్తం 52 వార్డులకు గాను 28 స్థానాలను కమలం తన ఖాతాలో వేసుకుని సత్తా చాటింది. ఈ జిల్లాలోనే శబరిమల ఉంది. ఈ నేపథ్యంలో శ్రీధరన్ విజయంపై విశ్వాసంతో ఉన్నారు. ఎనిమిది పదుల వయసులోనూ ఉత్సాహంగా ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 1,84, 310 మంది ఉండగా వారిలో 89,851 మంది పురుషులు, 94,457 మంది మహిళలు. కేరళలో ఎవరు గెలుస్తారన్న విషయం కన్నా పాలక్కాడ్ ను ఎవరు కైవశం చేసుకుంటారన్న దానిపైనే రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# పెద్దా రెడ్డికి కోలుకోలేని దెబ్బే



అనంతపురం, ఏప్రిల్ 16, :మున్సిపల్ ఎన్నికల తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నేతలు ఖుషీగా ఉన్నా ఒక్క తాడిపత్రిలో మాత్రం ఎమ్మెల్యే పెద్దారెడ్డి అన్ హ్యాపీ. మున్సిపాలిటీ చేజారిపోవడంతో ఆయన పూర్తిగా సైలెంట్ అయ్యారు. అధినాయకత్వానికి ఏం సమాధానం చెప్పుకోవాలో తెలియని పరిస్థితుల్లో పెద్దారెడ్డి ఉన్నారు. అందుకే పెద్దారెడ్డి దూకుడు తగ్గించాలని నిర్ణయించుకున్నారు. తన అనుచరులకు సయితం ఇదే రకమైన ఆదేశాలు జారీ చేశారంటున్నారు. పెద్దారెడ్డి గత ఎన్నికల్లో ఊహించని విధంగా జేసీ అస్మిత్ రెడ్డిపై విజయం సాధించారు. జగన్ చరిష్మాతో పాటు జేసీ ప్రభాకర్ రెడ్డి బరిలో లేకపోవడం, అస్మిత్ రెడ్డి యువకుడు కావడంతో ప్రజలుపెద్దారెడ్డి వైపు మొగ్గు చూపారు. దశాబ్దాల తర్వాత తాడిపత్రిలో తొలిసారి జేసీ బ్రదర్స్ కు పెద్దారెడ్డి చెక్ పెట్టి విజయం సాధించగలిగారు. దీంతో జగన్ కూడా అనేక సార్లు పెద్దారెడ్డి విషయాన్ని పార్టీ సీనియర్ నేతల వద్ద ప్రస్తావించేవారట. కాగా మున్సిపల్ ఎన్నికలకు ముందు పెద్దారెడ్డి జేసీ ప్రభాకర్ రెడ్డి ఇంటిపైకి తన అనుచరులతో వెళ్లడం ఆయనకు ఇబ్బందికరంగా మారింది. జేసీ ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్యేగా పనిచేసినా మున్సిపల్ కౌన్సిలర్ గా పోటీ చేసినప్పుడే పెద్దారెడ్డి అప్రమత్తమవ్వాల్సిందని పార్టీ నేతలే అభిప్రాయపడుతున్నారు. జేసీ ప్రభాకర్ రెడ్డిని తక్కువగా అంచనా వేయడం, మున్సిపాలిటీలో సరైన వ్యూహాన్ని అమలు పర్చకపోవడంతోనే తాడిపత్రిలో పెద్దా రెడ్డికి పరాభవం ఎదురయిందంటున్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల నుంచి పెద్దారెడ్డి పెద్దగా ప్రజల ముందుకు రావడం లేదు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు బయటకు వచ్చినా ఆయన వివాదరహితంగానే వెళ్లాలని నిర్ణయించుకున్నారు. వివాదాలు వస్తే అది జేసీకి ప్లస్ అవుతుందని మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత గాని పెద్దారెడ్డికి తెలిసి రాలేదు. జేసీపై వరస కేసులు కూడా మున్సిపాలిటీలో ఓటమికి ఒక కారణమని పెద్దారెడ్డి అధినాయకత్వానికి వివరణ ఇచ్చినట్లు తెలిసింది. మొత్తం మీద పెద్దారెడ్డి పరాభవాన్నుంచి తేరుకోలేకపోతున్నారు.

# 'నితీష్-బిజెపి' నిరంకుశ పాలనకు మచ్చుతునక



మార్చి 23న బీహార్ అసెంబ్లీ మున్నెన్నడూ ఎరుగని హింసకు వేదికగా నిలిచింది. సభా సాంప్రదాయాలకు, నిబంధనలకు విరుద్ధంగా పోలీసులు అసెంబ్లీ లోకి ప్రవేశించి శాసనసభ్యులను అసెంబ్లీ లోనే క్రూరంగా చావగొట్టారు. నితీష్ కుమార్ ప్రభుత్వం రాష్ట్ర పరిధిలో ఒక సాయుధ బలగాన్ని ఏర్పాటు చేసి దానికి అపరిమితమైన అధికారాలివ్వడానికి 'బీహార్ స్పెషల్ ఆర్మ్‌డ్ పోలీస్ బిల్-2021' ను ప్రతిపాదించింది. ఇప్పుడు "బీహార్ మిలిటరీ పోలీస్'' గా వ్యవహరిస్తున్న పోలీసు దళాలు ఇకపై "బీహార్ స్పెషల్ ఆర్మ్‌డ్ పోలీస్" గా పని చేస్తాయి. కేవలం పేరు మార్పు కోసమే చట్టం అయితే ఎవరికీ అభ్యంతరం ఉండదు. కాని ఈ చట్టం బీహార్ స్పెషల్ ఆర్మ్‌డ్ పోలీస్ కు విశేషమైన నిరంకుశ అధికారాలను కట్టబెడుతోంది. రాష్ట్రంలో శాంతిభద్రతలకు ఏ వ్యక్తి వలన అయినా విఘాతం కలుగుతుందని పోలీసులు భావిస్తే ఎటువంటి వారెంట్ లేకుండానే ఆ వ్యక్తిని అరెస్టు చేయవచ్చు. ఎవరైనా వ్యక్తి, లేదా వ్యక్తుల వలన ప్రభుత్వ కార్యాలయాల రక్షణకు ప్రమాదం కలుగుతుందని పోలీసులు భావిస్తే వారిని ముందుగానే అరెస్టు చేయవచ్చు. ఎటువంటి వారెంటూ అవసరం లేదు. సంబంధిత వ్యక్తుల, సంస్థల ఇళ్ళను, కార్యాలయాలను ఎటువంటి ముందస్తు అనుమతీ లేకుండానే పోలీసులు సోదా చేయవచ్చు. అలా సెర్చ్ చేసిన పోలీసు అధికారుల మీద ఎటువంటి కేసులనూ నమోదు చేయడానికి వీలులేదు. ఈ విధంగా అవధులు లేని నిరంకుశ అధికారాలను పోలీసులకు కట్టబెట్టడం అంటే ఇకపైన బీహార్ లో ఎవరూ నిరసనలను తెలియజేయడానికి వీలు లేదన్నమాట. నోరెత్తితే చాలు, జైల్లో కుక్కుతారు. అందుకే బీహార్ లో ప్రతిపక్షం మొత్తం ఈ బిల్లును ప్రవేశ పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. అయినా, నితీష్‌కుమార్ ప్రభుత్వం ఈ నిరంకుశ చట్టాన్ని ప్రవేశపెట్టింది. తనకున్న మెజారిటీని అడ్డం పెట్టుకుని, అదీ చాలక, పోలీసులను అసెంబ్లీలోకి అనుమతించి, ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై దాడి చేయించింది. తన ప్రభుత్వ పాలనపై రోజురోజుకూ పెరుగుతున్న వ్యతిరేకతను, విమర్శలను, నిరసనలను తుపాకీ బలంతో అణచివేయడానికే నితీష్ నేతృత్వం లోని జె.డి(యు)-బిజెపి ప్రభుత్వం సంకల్పించింది. ప్రజాస్వామ్యానికి చీకటి రోజులు దాపురిస్తున్నాయనడానికి ఇది మరో సంకేతంగా మనం పరిగణించాలి. బీహార్ మిలిటరీ పోలీస్ ఇప్పటివరకూ సాధారణ పోలీసు బలగాలకు తోడుగా పనిచేసే అదనపు పోలీసు బలగంగానే ఉంది. దానికంటూ ప్రత్యేక అధికారాలు ఏవీ లేవు. మన రాష్ట్రంలో కూడా అటువంటిదే ఎ.పి స్పెషల్ పోలీసు (ఎపిఎస్‌పి). ఏ సందర్భంలోనైనా జనరల్ పోలీసు బలగాలకు అదనంగా తోడు కావలసివస్తే అప్పుడు మాత్రమే ఈ బలగాలు (వీటినే రిజర్వు పోలీసు దళాలు అని కూడా అంటాం) రంగంలోకి దిగుతాయి. స్వంతంగా శాంతి, భద్రతల విషయంలో ఈ దళాలు ఎటువంటి నిర్ణయాలూ తీసుకోడానికి అధికారాలు లేవు. ప్రస్తుతం రాష్ట్రంలో మారుతున్న సామాజిక-రాజకీయ పరిణామాల దృష్ట్యా (అంటే ప్రభుత్వం పట్ల వ్యతిరేకత పెరుగుతున్న దృష్ట్యా) ఎదురౌతున్న సవాళ్ళను తట్టుకోడానికి ఈ అదనపు బలగాలకు కూడా ప్రత్యేక అధికారాలు కట్టబెట్టడం అవసరమని భావిస్తున్నట్టు ప్రభుత్వం అసెంబ్లీలో ఈ బిల్లు ప్రవేశపెడుతూ చెప్పింది. "బహుముఖ ప్రజ్ఞా పాటవాలు" కలిగిన పోలీసు బలగాలు నేటి తక్షణ ఆవశ్యకత అని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఇది పూర్తి అప్రజాస్వామిక చట్టం అని, కేవలం ప్రతిపక్షాలను అణచివేయడానికే ఈ చట్టాన్ని తీసుకువచ్చారని ప్రతిపక్ష పార్టీలు విమర్శిస్తున్నాయి. ''ఇది నితీష్ మోడల్ ఉపా (యుఎపిఎ) చట్టం" అని ఆర్‌జెడి సీనియర్ నేత మనోజ్ ఝా విమర్శించారు. కేంద్రం ఆ ఉపా చట్టం క్రింద ప్రభుత్వాన్ని విమర్శించే వారెవరైనప్పటికీ - విద్యార్థులు, ప్రొఫెసర్లు, రైతులు, మేధావులు, రాజకీయ ప్రత్యర్థులు - ఎవరినైనా ఎటువంటి విచారణా లేకుండా ఎంత కాలమైనా నిర్బంధిస్తోంది. ఇప్పుడు అటువంటి అధికారాన్నే తన ప్రత్యర్థులను అణచివేయడానికి నితీష్ కుమార్ కోరుకుంటున్నారు. అందుకే ఈ చట్టం'' అన్నారాయన. ఇంత అత్యవసరంగా ఈ తరహా చట్టాన్ని తీసుకురావలసిన అవసరమేమిటో, అందులోని ఔచిత్యమేమిటో, ఎటువంటి ఏకాభిప్రాయాన్నీ పెంపొందించకుండానే ఇంత దుర్మార్గమైన పద్ధతిలో ఈ చట్టాన్ని ఆమోదింప జేసుకోవడమెందుకో రాజకీయ విశ్లేషకులు వివరించలేక పోతున్నారు. చాలా విస్తృతమైన ప్రభావాన్ని కలిగించే ఇటువంటి చట్టాన్ని తీసుకువచ్చేటప్పుడు మామూలుగా అన్ని పార్టీల మధ్యా ఏకాభిప్రాయాన్ని సాధించడం కోసం ప్రభుత్వం ముందుగా ప్రయత్నించాలి. కాని కనీసం తన మంత్రివర్గ సహచరులను కూడా సంప్రదించినట్టు లేదు. ఇప్పుడున్న చట్టాల ప్రకారం సాధారణ పోలీసులకు సోదా చేయడానికి, అరెస్టు చేయడానికి అధికారాలు న్నాయి. అదే సమయంలో పౌరులకు కూడా ఆ పోలీసులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి అధికారం ఉంది. పోలీసులపై కోర్టుకు పోయే అవకాశం కూడా ఉంది. కాని ఈ కొత్త చట్టం పౌరులకు ఆ అవకాశం ఇవ్వడం లేదు. ఇది రాజ్యాంగ విరుద్ధం" అని మరో సీనియర్ ఆర్‌జెడి నేత శివానంద్ తివారీ అన్నారు. బీహార్ లోని ప్రతిపక్షాలన్నీ, (ఆర్‌జెడి, సిపిఐ, సిపిఎం, సిపిఎంఎల్ తదితరులు) ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టాయి. ఈ నిరంకుశ చట్టాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, అసెంబ్లీలో దాడి చేసిన పోలీసులను శిక్షించాలని, మార్చి 23న అసెంబ్లీలో జరిగిన ఘటనలకు ముఖ్యమంత్రి క్షమాపణలు చెప్పాలని వారు కోరుతున్నారు. ఈ బిల్లుకు ఆమోదం తెలపవద్దని గవర్నర్ కు విజ్ఞప్తి చేశారు. ఈ చర్యలతోబాటు కోర్టుకు కూడా పోవాలన్న యోచనలో ఉన్నారు. ముఖ్యమంత్రి నితీష్ కుమార్ మాత్రం ఈ వివాదాన్ని త్వరగా పరిష్కారం చేయాలన్న దృష్టితో వ్యవహరించడంలేదు. అసెంబ్లీలో శాసనసభ్యులపై జరిగిన దాడికి పూర్తి బాధ్యత ప్రతిపక్షాలదే అని, వారిపై జరిగిన దాడికి తాను ఏ విధంగానూ బాధ్యత వహించబోనని, అసెంబ్లీలో ఏం జరిగినా అందుకు బాధ్యత వహించాల్సినది స్పీకర్ మాత్రమేనని నితీష్ ప్రకటించారు. అసెంబ్లీ లోకి పోలీసులు ప్రవేశించడం గురించి స్పీకర్ కు ఎటువంటి ముందస్తు సమాచారమూ లేదని, ఆయన అనుమతి లేకుండానే పోలీసులు లోపలికి ప్రవేశించారని ఒక ఆర్‌జెడి ఎమ్మెల్యే అన్నారు. వాస్తవానికి స్పీకర్ ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలన్న యోచన కూడా చేశారని ఆ ఎమ్మెల్యే అన్నారు. నవంబర్ 2020లో నితీష్ కుమార్ ఏడవసారి బీహార్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశాక ఆయనలో విమర్శల పట్ల అసహనం తారాస్థాయికి చేరుకుంది. ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ ఏ పౌరుడైనా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే దానిని ఒక సైబర్ నేరంగా పరిగణిస్తూ 2021 జనవరిలో ఒక చట్టం తెచ్చారు నితీష్. దానిపై కూడా వ్యతిరేకత వెల్లువెత్తింది. అయినా నితీష్ వెనక్కి తగ్గలేదు. మృదు స్వభావిగా, ప్రజాతంత్రవాదిగా, అందరినీ మెప్పించగల నాయకుడిగా గతంలో నితీష్ కు మంచి పేరు ఉండేది. కాని బిజెపితో జత కట్టాక ఏ స్థాయిలో మార్పు వచ్చిందో ఇప్పుడు ప్రజలు గమనిస్తున్నారు. విస్తుబోతున్నారు. ఈ పోలీసు చట్టం విషయంలో బిజెపి ఇంతవరకూ పెదవి విప్పకపోవడం బట్టి ఆ పార్టీ నితీష్‌కుమార్ పై ఏ స్థాయిలో ఒత్తిడి చేయగలుగుతోందో గ్రహించవచ్చు. చట్టసభల్లో సాధించిన మెజారిటీ ఒక్కోసారి కొందరు నాయకులకు విపరీతమైన అహంకారాన్ని తెచ్చిపెడుతుంది. 1984లో అసాధారణమైన మెజారిటీతో ప్రధాని అయిన రాజీవ్ గాంధీ ఆ తర్వాత కొద్దికాలానికే బోఫోర్స్ కుంభకోణంలో చిక్కుకున్నారు. దాంతో విమర్శలు వెల్లువెత్తాయి. వాటిని సహించలేకపోయిన రాజీవ్‌గాంధీ జులై 1988లో పరువునష్టం బిల్లు తెచ్చారు. తద్వారా పత్రికల నోళ్ళు మూయాలని ప్రయత్నించారు. కాని దానిపై తలెత్తిన వ్యతిరేకతెంత తీవ్రంగా ఉండినదంటే సెప్టెంబరు 1988లో ఆ బిల్లును ఉపసంహరించుకుంటూ రాజీవ్‌గాంధీ ఓ ప్రకటన చేశారు. 'మన ప్రజాస్వామ్యం సచేతనంగా ఉండడానికి, దాని అంతర్గత బలంలో ఒక విడదీయలేని భాగంగా ఉన్న పత్రికా స్వేచ్ఛ ముఖ్య కారణం. పత్రికా స్వేచ్ఛ లేకుండా ప్రజాస్వామ్యం మనజాలదు. ఎప్పటికీ నిలిచి పోయే మన స్వాతంత్ర్యోద్యమపు విలువల నుండి మన దేశంలో పత్రికా రంగం ఆవిర్భవించింది. ఆ వారసత్వానికి మేం కట్టుబడి వున్నాం." అని ఆ ప్రకటనలో పేర్కొన్నాడు. స్వాతంత్ర్యానంతరం, అధికారంలో చాలా కాలం కొనసాగిన కాంగ్రెస్ పార్టీలో ఎన్నో పెడధోరణులు, నియంతృత్వ పోకడలు ప్రవేశించాయి. అయినప్పటికీ ఏదో ఒక మూల ఆ ''స్వాతంత్ర్యోద్యమపు విలువలు ఎంతో కొంత ఇంకా ఉండబట్టి రాజీవ్ గాంధీ ప్రకటనలో అది వ్యక్తమైంది. కాని జాతీయోద్యమానికి దూరంగా ఉంటూ ఇతోధికంగా బ్రిటిష్ పాలకుల పట్ల తమ విధేయతను ప్రదర్శిస్తూ వచ్చిన బిజెపి నుండి ఆ విధమైన స్పందన ఆశించగలమా? ఆ బిజెపితో చెలిమి చేసి నితీష్ దిగజారిన వైనం ఇప్పుడు కళ్ళకు కడుతోంది. పూర్వకాలపు నితీష్ ఇంకా ఏ మూలనైనా సజీవంగా ఉన్నారా లేక బిజెపి ఉచ్చునే మహా ప్రసాదంగా భావిస్తున్న నితీష్ మాత్రమే మిగిలివున్నారా అనేది పోలీసు బిల్లు విషయంలో నిగ్గు తేలనుంది.

# పుదుచ్చేరి నువ్వా, నేనా..?

పాండిచ్చేరి, ఏప్రిల్ 16, :పుదుచ్చేరి అతి చిన్న రాష్ట్రం. అయినా ఈ ఎన్నికలు రెండు జాతీయ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. నిన్న మొన్నటి దాకా కాంగ్రెస్ అధికారంలో ఉంది. అయినా కాంగ్రెస్ ను పాలనను సజావుగా జరగకుండా బీజేపీ అడుగడుగునా అడ్డుకుందన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే బీజేపీకి కూడా ఇక్కడ అవకాశాలు మెండుగానే ఉన్నాయి. బలమైన పార్టీలతో కలసి బీజేపీ ఈసారి పుదుచ్చేరి బరిలోకి దిగింది. పుదుచ్చేరిలో మొత్తం 33 అసెంబ్లీ స్థానాలున్నాయి. ఇందులో మూడింటిలో సభ్యులు నామినేట్ అవుతారు. ప్రస్తుతం 30 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. పదహారు స్థానాలను దక్కించుకున్న వారు అధికారంలోకి వస్తారు. ఈసారి మొన్నటి వరకూ ముఖ్యమంత్రిగా ఉన్న నారాయణస్వామి ఈసారి పోటీ చేయడం లేదు. ఆయన పై అసమ్మతి తీవ్రంగా ఉండటంతో పార్టీ అధిష్టానం నారాయణ స్వామికి ప్రచార బాధ్యతలను మాత్రమే అప్పగించింది. తమను పాలన చేయకుండా ఎలా అడ్డుకున్నదీ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు వివరిస్తుంది. డీఎంకే తో కలసి కాంగ్రెస్ పుదుచ్చేరిలో పోట ?చేస్తుంది. తమిళనాడులో డీఎంకేకు సానుకూల పవనాలు వీస్తుండటంతో ఇక్కడ కూడా తమకు అదే వేవ్ కొనసాగుతుందని కాంగ్రెస్ భావిస్తుంది.

అందుకోసమే కాంగ్రెస్ అధికారం నిలుపుకునేందుకు శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తుంది. రాహుల్ గాంధీ సయితం ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇక పుదుచ్చేరిలో ఈసారి ఎలాగైనా పాగా వేయాలని బీజేపీ పట్టుదలగా ఉంది. బీజేపీ ఇక్కడ అన్నాడీఎంకే, ఎన్ఆర్ కాంగ్రెస్ లతో కలసి బరిలోకి దిగింది. మోదీతో సహా కేంద్ర మంత్రులందరూ ప్రచారం నిర్వహిస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా ఇస్తామని కూడా మ్యానిఫెస్టోలో ప్రకటించింది. బీజేపీ కూటమి విజయం సాధిస్తే రంగస్వామి ఇక్కడ ముఖ్యమంత్రి అభ్యర్థి అవుతారు. ఇలా పుదుచ్చేరిలో బీజేపీ, కాంగ్రెస్ హోరా హోరీ తలపడ్డాయి. మరి విజయం ఎవరివైపు అన్నది మే 2వ తేదీన తేలనుంది.

## బెంగాల్ ఎన్నికలలో సోషల్ ఇంజనీరింగే

కోల్ కత్తా, ఏప్రిల్ 16, :పశ్చిమ బెంగాల్ ఎన్నికలను ఈసారి కులాలు శాసిస్తున్నాయి. కులాల ప్రాతిపదికగానే ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రధానంగా ఓబీసీలు ఎటువైపు మొగ్గు చూపితే వారికే విజయం వరిస్తుందని టీఎంసీ, బీజేపీలు లెక్కలు వేసుకుంటున్నాయి. మొత్తం ఎనిమిది దశల్లో జరిగే పశ్చిమ బెంగాల్ లో కులాల వారీగా లెక్కలు వేసుకుని మరీ టీఎంసీ, బీజేపీలు బరిలోకి దిగాయి. తమ మ్యానిఫేస్టోలో కూడా కులాలకే ప్రాధాన్యత కల్పించాయి. బెంగాల్ ఎన్నికల్లో ఓబీసీలు క్రియాశీలకంగా ఉన్నారు. దాదాపు యాభై సీట్లలో వీరు ప్రభావం చూపనున్నారు. అందుకోసం వీరిని ఆకట్టుకునేందుకు తొలి నుంచి బీజేపీ, టీఎంసీలు ప్రయత్నిస్తున్నాయి. 2019 ఎన్నికల్లో ఓబీసీలు ఎక్కువగా బీజేపీ వైపు మొగ్గు చూపారు. దీంతో ఊహించని విధంగా పశ్చిమ బెంగాల్ లో బీజేపీ 18 లోక్ సభస్థానాలను గెలుచుకుంది. ఈసారి ఆ పొరపాటు జరగకుండా మమత బెనర్జీ ముందు జాగ్రత్త తీసుకున్నారు. ఓబీసీలతో పాటు మహిషి, తేలి, సాహా వంటి కులాలకు కూడా ఓబీసీ రిజర్వేషన్లు కల్పిస్తామని మమత బెనర్జీ హామీ ఇచ్చారు. దీనికి ధీటుగా బీజేపీ కూడా సమాధానమిచ్చింది. తాము అధికారంలోకి రాగానే మమత అడ్డుకుంటున్న కులాలను తాము ఓబీసీ రిజర్వేషన్ జాబితాలో చేరుస్తామని చెప్పింది. మండల్ కమిషన్ ప్రాతిపదికన మహిష్య, తిల్లి వంటి ఇతర హిందూ కులాలను సయితం ఓబీసీ రిజర్వేషన్లలో చేరుస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. ఉత్తర 224 పరగణాలు, నాడియా జిల్లాలతో పాటు దక్షిణ బెంగాల్ లోని కొన్ని ప్రాంతాలు బీజేపీకి అనుకూలంగా ఉన్నాయి. ఈ సామాజికవర్గాలను ఆకట్టుకునేందుకు మమత బెనర్జీ మతువా, ఆదివాసీ, రాజవంశీ, బాగ్డీ, బౌరి వంటి కులాలకు తన మ్యానిఫేస్టోలో చోటు కల్పించారు. మొత్తంగా చూస్తే పశ్చిమ బెంగాల్ లో ఈసారి కులాలు ప్రధాన పాత్ర పోషిస్తాయంటున్నారు. అభ్యర్థుల ఎంపిక కూడా సామాజికవర్గాలకు అనుగుణంగానే జరిగింది. దీంతో ఫలితం ఎవరి వైపు ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

## మాస్కులపై అవగాహన

తణుకు, ఏప్రిల్ 16, :ప్రపంచాన్ని వణికిస్తున్న మహమ్మారి కరోనా వైరస్ విజృంభిస్తున్న తరుణం లో పోలీసులు అవగాహన కార్యక్ర మాలను విస్తృతం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి గౌతమ్ సవాంగ్ ఆదేశాల పై పశ్చిమగోదావరి జిల్లాలో పోలీసులు అవగాహన కార్యక్రమాలు చేపట్టా రు. ప్రజలు మాస్కను ధరించే విషయంలో ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో సంచరించే సమయాలలో భౌతిక దూరం పాటిస్తూ కరోనా ని నివారించేలా కృషి చేయాలని ఈ సందర్భంగా పోలీసులు పిలుపు నిచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ నారాయణ్ నాయక్, తణుకు సిఐ చైతన్య కృష్ణ పోలీస్ సిబ్బంది తో తణుకు టౌన్ లో ఉన్న షాపింగ్ మాల్స్,వ్యాపార సముదాయాలు పట్టణ వద్ద ప్రజలు మాస్కులు ధరించాలని అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు కరోనా ని నివారించాలంటే బ్రహ్మాస్త్రం మాస్క్ అని, ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో సంచరించే సమయాల్లో భౌతిక దూరాన్ని పాటిస్తూ ప్రతి ఒక్కరు శానిటైజర్ ను వినియోగించాలని కోరారు. అనంతపురం జిల్లా తాడి పత్రి లో కొత్త మార్కెట్ వద్ద దుకాణం లో ఉన్నవారికి మునిసిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి మస్కులను పంపిణీ చేశారు. మార్కెట్ బయట ,లోపల ఉన్నవారికి మాస్క్ లు పంపిణీ చేసి వ్యర్థాలను తొలగించారు. కరోనా సెకండ్ వేవ్ చాలా తీవ్రంగా ఉందని టీడీపీ నేత, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఫస్ట్ వేవ్ కంటే సెకండ్ వేవ్ చాలా బలంగా ఉందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించాలని, శానిటైజర్ తప్పనిసరిగా వాడాలని సూచించారు. దుకాణదారులు, చిరు వ్యాపారస్తులు మాస్కులు కచ్చితంగా ధరించాలని... లేకపోతే కరోనా బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. తేరు బజార్ లో కరోనా బారిన వారు ఎక్కువ సంఖ్యలో ఉన్నారని, ఈ ప్రాంతంలోని వారు మరింత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

## టీ కార్మికులు ఎటూ ఉంటే వారిదే గెలుపు

గౌహాత, ఏప్రిల్ 16, ప్రజాపాలన ప్రతినిధి:నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతానికి జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ అసోం పై దృష్టి సారించాయి. తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్, పుదుచ్చేరిలకన్నా ఈశాన్య భారతంలోని అసోం లోనే తమకు విజయావకాశాలు ఎక్కువని పార్టీలు భావిస్తుండటమే ఇందుకు కారణం. ఇందుకోసం హస్తం, కమలం పార్టీలు సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. అధికారాన్ని కాపాడుకునేందుకు కాషాయపార్టీ, కైవశం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ పోరాడుతున్నాయి. అసోం గణపరిషత్ ఇతర చిన్న పార్టీలతో బీజేపీ జట్టుకట్టి బరిలోకి దిగగా, సీపీఐ, సీపీఎం, సీపీఐ (ఎంఎల్), బోడో పీపుల్స్ ఫ్రంట్, ఆలిండియా డెమొక్రటిక్ ఫ్రంట్ వంటి పార్టీలతో మహా ఘట్ బంధన్ గా ఏర్పడిన హస్తం పార్టీ పోరాడుతోంది. అధికార సాధనలో భాగంగా ఏ ఒక్క చిన్న అవకాశాన్ని వదులుకునేందుకు పార్టీలు సిద్ధంగా లేవు. ఇందులో భాగంగానే తేయాకు కార్మికులపై రెండు జాతీయ పార్టీలు గురిపెట్టాయి. ఈశాన్య భారతంలోని కీలకమైన అసోం రాష్ట్రం పేరు చెప్పగానే ఎవరికైనా ముందుకు గుర్తుకు వచ్చేది తేయాకు పరిశ్రమ. తేయాకు పంటకు రాష్ట్రం ప్రసిద్ధి. దేశవ్యాప్తంగా తేయాకు ఉత్పత్తుల్లో సగం ఇక్కడి నుంచే వస్తుంది. దాదాపు 68,465 చిన్న, 825 పెద్ద తేయాకు తోటలు ఇక్కడ ఉన్నట్లు అంచనా. రాష్ట్ర రాజకీయాల్లో తేయాకు లాబీ కీలకమైనది. రాష్ట్ర జనాభాలో 17 శాతం మంది తేయాకు కార్మికులే కావడం గమనార్హం. మొత్తం 126 నియోజకవర్గాల్లో దాదాపు 40 నుంచి 50 శాతం నియోజకవర్గాల్లో గెలుపోటములను ప్రభావితం చేయగల శక్తి వీరికి ఉంది. ముఖ్యంగా ఎగువ అసోంలోని పలు నియోజకవర్గాల్లో వీరి ప్రభావం ఎక్కువ. దీంతో తేయాకు కార్మికులను తమవైపు తిప్పుకునేందుకు రెండు పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయి. తాము అధికారంలోకి వస్తే వారికి అరచేతిలో స్వర్గం చూపిస్తామని పార్టీలు ఆశ పెడుతున్నాయి. ఈ విషయంలో ఏ పార్టీ వెనక్కి తగ్గడం లేదు. ప్రస్తుతం తేయాకు కార్మికులు అరకొర జీతాలతో దుర్భర జీవనం గడుపుతున్నారు. వైద్య ఆరోగ్య సదుపాయాలు, వారి పిల్లలకు విద్యా సౌకర్యాలు నామమాత్రమే. రోజంతా పనిచేసినాలభించేది నామమాత్ర కూలీనే. ఈ పరిస్థితిని మారుస్తామని రెండు పార్టీలు హామీలు గుప్పిస్తున్నాయి. దశాబ్దాల పాటు హస్తం పార్టీకి దన్నుగా నిలిచిన తేయాకు కార్మికులు 2016 అసెంబ్లీ ఎన్నికల్లో కాషాయపార్టీకి మద్దతిచ్చారు. నాటి హామీలను కాషాయపార్టీ నిలబెట్టుకోలేదని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. తాము అధికారంలోకి వచ్చిన గంటల్లోనే తే?యకు కార్మికుల కనీస కూలీని రోజుకు రూ.365 చేస్తామని సాక్షాత్తు పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. తేయాకు కార్మికులను ఆకట్టుకునేందుకు ఇటీవల పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా వాద్రా గాంధీ తేయాకు కార్మికులతోకలసి తేయాకు కోశారు. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ సైతం స్వయంగా ఓ తేయాకు కార్మికురాలితో కలసి భోజనం చేశారు. మొదటినుంచీ తేయాకు కార్మికులు తమకు అండగా నిలిచారని మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ అగ్రనేత పవన్ సింగ్ ఘటోవర్ గుర్తు చేశారు. ఈసారి బీజేపీ మాటలను కార్మికులు నమ్మరని తమవైపే ఉంటారని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ కూడా దీటుగా ప్రచారం చేస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ వివిధ సభల్లో ప్రసంగిస్తూ తన చాయ్ వాలా నేపథ్యాన్ని గుర్తు చేశారు. రోజువారీ రూ.137 కూలీని రూ.167 చేసిందీ, 2018లో రూ.దానిని రూ.217కు పెంచింది తమ సర్కారేనని ఊదరగొట్టారు. తేయాకు రంగాన్ని ఆదుకునేందుకు బడ్జెట్ లో వెయ్యి కోట్ల నుంచి మూడు వేల కోట్లు కేటాయించింది తమ సర్కారేనని మోదీ వివరించారు. ముఖ్యమంత్రి సర్బానంద సోనావాల్, పార్టీలో కీలక నేత, రాష్ట్ర మంత్రి హిమంత్ బిశ్వ శర్మ ఇదే విషయాన్ని పదే పదే ప్రస్తావించారు. అంతిమంగా తేయాకు కార్మికులు ఎవరికి మద్దతుగా నిలుస్తారో , ఎవరి మాటలను విశ్వసిస్తారో తెలయాలంటే మే 2వరకు వేచిచూడక తప్పదు.



# సినిమాస్కోప్

## ఓటీటీ వరల్డ్ లో సౌత్ హీరోయిన్స్ సక్సెస్ అయినట్లేనా..?



వెబ్ కంటెంట్ హవా స్టార్ట్ అవడంతో స్టార్ యాక్టర్స్ డైరెక్టర్స్ వెబ్ వరల్డ్ లో అడుగులు వేస్తున్నారు. బాలీవుడ్ లో ఎప్పటి నుంచో స్టార్స్ వెబ్ సిరీస్ లలో నటిస్తున్నప్పటికీ.. సౌత్ ఇండస్ట్రీలో కరోనా లాక్ డౌన్ సమయంలోనే ఈ ట్రెండ్ మొదలైంది. దక్షిణాది నుంచి సమంత అక్కినేని – ప్రియమణి – కాజల్ అగర్వాల్ – తమన్నా భాటియా – శృతి హాసన్ – నిత్యా మీనన్ – పాయల్ రాజ్ పుత్ – ఈషా రెబ్బా – అమలా పాల్ – అషిమా నర్వాల్ వంటి హీరోయిన్లు వెబ్ సిరీస్ లలో నటించారు. స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ 'లైవ్ టెలికాస్ట్' అనే హారర్ వెబ్ సిరీస్ తో ఓటీటీలోకి డెబ్యూ ఇచ్చింది. డైరెక్టర్ వెంకట్ ప్రభు రూపొందించిన ఈ సిరీస్ డిస్నీంహాట్ స్టార్ లో విడుదలైంది. అయితే కాజల్ నటించిన మొట్టమొదటి వెబ్ కంటెంట్ ఆడియన్స్ ని మెప్పించలేకపోయింది. మరో అగ్ర కథానాయిక మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా హాట్ స్టార్ కోసం 'నవంబర్ స్టోరీస్'.. ఆహా యాప్ కోసం '11త్ అవర్' అనే ఒరిజినల్ సిరీస్ లలో నటించింది. ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో కార్పొరేట్ డ్రామాగా రూపొందిన '11త్ అవర్' తమన్నాకు మంచి పేరు తెచ్చిపెట్టింది. 'నవంబర్ స్టోరీస్' త్వరలోనే స్ట్రీమింగ్ కానుంది. నేషనల్ అవార్డ్ విన్నింగ్ యాక్టర్ ప్రియమణి అందరికంటే ముందుగానే ఓటీటీ వరల్డ్ లో అడుగుపెట్టింది. 'ది ఫ్యామిలీ మ్యాన్' అనే వెబ్ సిరీస్ కో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ క్రమంలో పలు హిందీ వెబ్ కంటెంట్ లలో నటించారు. త్వరలో 'ది ఫ్యామిలీ మ్యాన్ 2' తో రాబోతోంది. బబ్లీ బ్యూటీ నిత్యామీనన్ 'బ్రీథ్' అనే హిందీ వెబ్ సిరీస్ తో వచ్చింది. అభిషేక్ బచ్చన్ తో కలిసి చేసిన ఈ సిరీస్ అమెజాన్ ప్రైమ్ లో స్ట్రీమింగ్ అయింది. మొదటి సీజన్ స్థాయిలో మెప్పించనప్పటికీ ప్రేక్షకుల నుంచి వర్వాలేదనే ఫీడ్ బ్యాక్ అందుకుంది. ఇదే క్రమంలో శృతి హాసన్ – ఈషా రెబ్బా – అమలా పాల్ 'పిట్టకథలు' అనే ఒరిజినల్ సిరీస్ లో నటించారు. నెట్ ఫ్లిక్స్ లో విడుదలైన ఈ సిరీస్ కు టాలీవుడ్ డైరెక్టర్స్ నాగ్ అశ్విన్ – నందిని రెడ్డి – తరుణ్ భాస్కర్ – సంకల్ప్ రెడ్డి దర్శకత్వం వహించారు. భారీ అంచనాలతో వచ్చిన పిట్టకథలు ఆడియన్స్ ని నిరాశపరిచింది. '%=ఇ% 100' బ్యూటీ పాయల్ రాజ్ పుత్ 'అనగనగా ఓ అతిథి' సిరీస్ తో ఓటీటీలోకి వచ్చింది. ఆహాలో స్ట్రీమింగ్ అవుతున్న ఈ సిరీస్.. అదే ఓటీటీలో మరో వెబ్ సిరీస్ చేసే అవకాశం కల్పించింది. అక్కినేని సమంత 'ది ఫ్యామిలీ మ్యాన్-2' వెబ్ సిరీస్ ద్వారా వెబ్ వరల్డ్ లో అడుగుపెడుతోంది. ఇది సక్సెస్ ఫుల్ వెబ్ సిరీస్ 'ది ఫ్యామిలీ మ్యాన్' కు కొనసాగింపుగా వస్తోంది. ఈ సిరీస్ ను రాజ్ నిడిమోరు – కృష్ణ డీకే రూపొందిస్తున్నారు. ఇందులో సమంత టెర్రరిస్ట్ పాత్రలో నటిస్తోంది. ఫిబ్రవరిలో విడుదల కావాల్సిన ఈ సిరీస్ వాయిదా పడింది. అయితే త్వరలోనే అమెజాన్ ప్రైమ్ వీడియోలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. మరి సమంత ఓటీటీ కంటెంట్ తో ఆడియన్స్ ని ఏ మేరకు ఆకట్టుకుంటదో చూడాలి.

## హాయ్ గర్మీ కో బాయ్ గర్మీ! గోవా ట్రిప్ లో జాన్వీ చిలౌట్!!




జీవితంలో ప్రతి క్షణాన్ని ఆస్వాధించాలి. కష్టనష్టాల్లో ఎదురీదాలి. అప్పుడే జీవితానికి సాంత్వన. మామ్ శ్రీదేవి మరణానంతరం జాన్వీ కపూర్ కంబ్యాక్ అయిన తీరుకు అభిమానులు ఫిదా అయిపోతున్నారు. తన తల్లి తాను నటించిన తొలి చిత్రం చూడకుండానే ఇహలోకం నుంచి అంతర్థానం అయ్యారు. ఆ వేదన జాన్వీలో ఎప్పటికీ అలానే ఉంది. కానీ అన్నిటినీ అధిగమించి ప్రతి సందర్భాన్ని ఎలా సంతోషంగా గడపాలో జాన్వీ స్ఫూర్తివంతమైన జర్నీ చెబుతోంది. సోషల్ మీడియాల్లో నిరంతరం ఫోటోషూట్లను షేర్ చేసే జాన్వీ ఈ వేసవిపైనా తనదైన శైలిలో ఫన్నీగా సెటైరికల్ గా స్పందిస్తున్నారు. తాజాగా గోవా నుంచి ఓ స్పెషల్ ఫోటోని షేర్ చేసి దానికి హాయ్ గర్మీ కో బాయ్ గర్మీ! అంటూ వ్యాఖ్యను ట్యాగ్ చేశారు. దానికి ఒక వైపు కుక్క ఈమోజీ.. మరోవైపు స్నోమాన్ ఈమోజీని షేర్ చేశారు. ప్రస్తుతం ఈ ఫోటో అభిమానుల్లో వైరల్ గా మారింది. ఇక జాన్వీ ఇటీవలే మాల్దీవుల విహారాన్ని ముగించి ముంబైకి చేరుకున్న సంగతి తెలిసిందే. అయితే ఈసారి గోవా ట్రిప్ ప్లాన్ చేశారట. కానీ ముంబై నగరంలో జనతా కర్ఫ్యూ అమల్లోకి రావడంతో కొంత ఇబ్బంది పడిందట. కోవిడ్ కేసులు పెరగడం వల్ల మహారాష్ట్ర ప్రభుత్వం నగరంలో షూటింగులు నిలిపివేసి 15 రోజుల పాటు జనతా కర్ఫ్యూ విధించింది. ప్రస్తుతం గోవాలో ఉన్న జాన్వి తన సోషల్ మీడియాలో ఆసక్తికరమైన పోస్ట్ ల్ని షేర్ చేస్తున్నారు. తన రోజువారీ కార్యకలాపాల గురించి తన అభిమానులకు అప్ డేట్స్ ను పోస్ట్ చేస్తూనే ఉన్నారు. ప్రస్తుతం వేసవి తాపాన్ని తాను ఎలా ఎదుర్కొంటోందో జాన్వీ వివరిస్తున్నారు. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. ఇటీవల నెట్ ఫ్లిక్స్ ఘోస్ట్ స్టోరీస్ లో జాన్వీ నటించిన సంగతి తెలిసిందే. తదుపరి దోస్తానా 2 రిలీజ్ కి రావాల్సి ఉండగా.. గుడ్ లక్ జెర్రీ సెట్స్ పై ఉంది.

## దరువేసిన సోనూ సూద్.. చిందేస్తున్న ఫ్యాన్స్!



సోనూ సూద్ ఇప్పుడు కేవలం నటుడు కాదు.. అంతకు మించిన మానవతా వాది. ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచే కరుణామూర్తి. కొవిడ్ తొలి దశలో మొదలు పెట్టిన ఆయన సేవా కార్యక్రమాలు.. ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. కరోనా బాధితులకు మాత్రమే కాకుండా.. ఇతరత్రా కష్టాల్లో ఉన్నవారిని కూడా ఆదుకున్నారు.. ఇంకా చేయూతనిస్తూనే ఉన్నారు. అయితే.. తనలోని మనసున్న మనిషిని ప్రపంచానికి పరిచయం చేసిన సోనూ.. ఇప్పుడు తనలోని విభిన్న కళలను కూడా చూపిస్తున్నాడు. ఆ మధ్య షూటింగ్ గ్యాప్ లో దోశలు వేసి తనలో నలభీముడు ఉన్నాడని చెప్పిన రియల్ హీరో.. ఇప్పుడు ఆయనలోని బ్యాండ్ వాలాను బయటకు తెచ్చారు. లేటెస్ట్ గా ఓ వీడియోను షేర్ చేశారు సోనూ. అందులో సంప్రదాయ డోలును వాయిస్తూ కనిపించారు. పెళ్లిళ్లలో ఉపయోగించే భజంత్రీలకు చెందిన డోలును అద్భుతంగా వాయిస్తూ.. టాలెంట్ నిరూపించుకున్నారు. ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. మనసు మాత్రమే కాదు.. టాలెంట్ కూడా విశాలమైనదని కామెంట్స్ చేస్తున్నారు ఫ్యాన్స్. సోనూ నువ్వు కేక.. అంటూ ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

## పోలీస్ పాత్రలపై మక్కువ చూపిస్తున్న పవర్ స్టార్..!




'వకీల్ సాబ్' తో గ్రాండ్ రీఎంట్రీ ఇచ్చిన పవర్ స్టార్ పవన్ కళ్యాణ్.. ఐదు సినిమాలు లైన్ లో పెట్టాడు. అందుకు పవర్ ఫుల్ డైరెక్టర్ హరీష్ శంకర్ తో చేయబోయే 'చ%ఝాఖ%28' ప్రాజెక్ట్ ఒకటి. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని – రవి శంకర్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో నిర్మించనున్నారు. రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ ఈ సినిమాకి మ్యూజిక్ అందిస్తున్నారు. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ సంబంధించి ఓ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. అదేంటంటే పవన్ ఈ చిత్రంలో తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేయబోతున్నారట. అంతేకాదు ఇందులో ఒకటి పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్ర అని అంటున్నారు. పవన్ కళ్యాణ్ ఇంతకముందు హరీష్ శంకర్ దర్శకత్వంలో వచ్చిన బ్లాక్ బస్టర్ మూవీ 'గబ్బర్ సింగ్' లో పోలీస్ ఆఫీసర్ గా కనిపించాడు. అలానే డైరెక్టర్ ఎస్.జె. సూర్యతో కలిసి చేసిన 'కొమరం పులి' సినిమాలో స్పెషల్ పోలీసాఫీసర్ గా నటించాడు. ఇక బాబీ దర్శకత్వంలో పవన్ స్టోరీ అందించిన 'సర్దార్ గబ్బర్ సింగ్' లో కూడా ఆయనది పోలీస్ పాత్ర అనే విషయం తెలిసిందే. అలానే 'గుడుంబా శంకర్' సినిమాలో ఓ సీన్ లో ఖాకీ డ్రెస్ వేసుకొని అలరించాడు. ఈ క్రమంలో ప్రస్తుతం నటిస్తున్న 'అయ్యప్పనమ్ కోషియం' తెలుగు రీమేక్ లో కూడా పవన్ నిజాయితీ గల పోలీస్ ఆఫీసర్ గా కనిపించనున్నాడు. అయితే ఇప్పుడు '%ఝాఖ%28' సినిమాలో కూడా ఖాకీ డ్రెస్ వేసుకోబోతున్నాడని టాక్ వినిపిస్తోంది. ఇందులో నిజమెంతో తెలియాలంటే ఇంకొన్నాళ్లు ఆగాల్సిందే.

## చేతినిండా సినిమాలున్నా హిట్స్ లేని యువహీరో..!



టాలీవుడ్ యువహీరో రాజ్ తరుణ్.. కొన్నేళ్లుగా కెరీర్ పరంగా ఇబ్బందులు పడుతున్నాడు. ప్రస్తుతం ఖచ్చితంగా హిట్ కావాల్సిందే అనే పరిస్థితిలో ఉన్నాడు ఈ హీరో. ఇటీవలే 'పవర్ ప్లే' అనే థ్రిల్లర్ మూవీతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు. కానీ పవర్ ప్లే కూడా హిట్ అవ్వకుండా హ్యాండ్ ఇవ్వడంతో సైలెంట్ అయిపోయాడు. దాదాపు 6 సంవత్సరాలుగా రాజ్ తరుణ్ ఓ సాలిడ్ హిట్ కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నాడు. ఉయ్యాలా జంపాల సినిమా చూపిస్తా మావ కుమారి 21ఎఫ్ సినిమాల తర్వాత ఒక సూపర్ హిట్ కూడా రాజ్ ఖాతాలో పడలేదు. ఇన్నేళ్లలో చాలా సినిమాలే చేసాడు కానీ చేసినవన్నీ బెడిసి కొట్టడంతో వెరైటీ జానర్స్ ట్రై చేస్తున్నాడు. ఈ హీరోను లవ్ కామెడీ జానర్స్ లో చూసి జనాలకు బోర్ కొట్టేసింది. ప్రస్తుతం కొత్తరకం సినిమాలనే ప్రేక్షకులు ఇష్టపడుతున్నారు. అందుకే రూట్ మార్చి థ్రిల్లర్ మూవీ చేసాడు. కెరీర్ ప్రారంభంలో అవకాశాలు వస్తున్నాయి కదా అని కథల విషయంలో అజాగ్రత్తగా సినిమాలు చేసుకుంటూ పోయాడు. అనుకోని రేంజిలో ఫ్లాప్ లతో వెనకబడి పోయాడు. ఇప్పుడు మళ్లీ హిట్టు కోసం నానాతంటాలు పడుతున్నాడు. ఇదిలా ఉండగా.. సినిమాలు హిట్ కాకపోయినా రాజ్ చేతిలో అవకాశాలు మాత్రం బాగానే ఉన్నాయి. ఇటీవలే ఆ సినిమాల విషయాలు బయటపెట్టాడు. డైరెక్టర్ శ్రీనివాస్ గవిరెడ్డితో రెండో సినిమా ఇప్పటికే పూర్తి కావచ్చిందట. అలాగే డైరెక్టర్ విరించి వర్మతో మరో సినిమా 60 శాతం పూర్తయిందని చెప్పాడు. అలాగే వీరంకి శాంటో అనే నూతన దర్శకుడితో ఓ సినిమా పూర్తి కావచ్చిందని చెప్పాడు. వీటన్నింటితో పాటు విజయ్ కుమార్ కొండాతో హ్యాట్రిక్ సినిమా చేయనున్నట్లు ప్రకటించాడు. సురేష్ ప్రొడక్షన్స్ లో ఆ సినిమా రానుందని చెప్పుకొచ్చాడు హీరో. మరి ఈ సినిమాలతో అయినా రాజ్ తరుణ్ ఫామ్ లోకి వస్తాడేమో చూడాలి.

## స్పెషల్ షూట్ తో మైండ్ బ్లాక్ చేసిన అనసూయ



బుల్లితెర యాంకర్ గా పెద్ద తెర నటిగా అనసూయ స్పీడ్ గురించి చెప్పాల్సిన పనే లేదు. నేటితరంలో గ్లామరస్ యాంకర్ గా పేరు తెచ్చుకున్న అనసూయ టాలీవుడ్ లో ఇప్పటికిప్పుడు డజను క్రేజీ సినిమాల్లో నటిస్తున్నారు. అటు తమిళంలోనూ సేతుపతి లాంటి క్రేజు ఉన్న హీరో సినిమాలో నటిస్తున్నారు. మరోవైపు సోషల్ మీడియా వేదికగా అనసూయ స్పీడ్ గురించి తెలిసిందే. నిరంతరం ఇన్ స్టా వేదికగా లేటెస్ట్ ఫోటోషూట్లను అనసూయ షేర్ చేస్తున్నారు. ట్రెడిషనల్ లుక్.. మోడ్రన్ ఔట్ ఫిట్ లో అనసూయ ఫోటోషూట్లు యువతరంలో వైరల్ గా మారుతున్నాయి. తాజాగా మరో స్పెషల్ ఫోటోషూట్ తో అనసూయ మైండ్ బ్లాక్ చేశారు. కాఫీ కలర్ స్కర్ట్ కాంబినేషన్ పింక్ మిశ్రమ రంగు టాప్ తో అనసూయ చాలా స్పెషల్ గా కనిపిస్తున్నారు. ఆ నెక్ లైన్ లో పూసల దండలు స్పెషల్ పెండెంట్ లాకెట్లు.. అంతే ఆకర్షణీయంగా ఉన్నాయి. అనసూయ ఎడమ చేతి మణికట్టుపై ఆ పచ్చబొట్టు అంతే ప్రత్యేక ఆకర్షణగా మారింది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోషూట్ అంతర్జాలంలో సునామీ సృష్టిస్తోంది. రంగమార్తాండ-థ్యాంక్యూ బ్రదర్ -వేదాంతం రాఘవయ్య- ఖిలాడీ చిత్రాల్లో అనసూయ నటిస్తున్నారు. పవన్- క్రిష్ సినిమాలోనూ ఓ కీలక పాత్రను అనసూయ పోషిస్తున్నారు.


మాస్టర్ కీ TV
(అంబేడ్కర్ TV)

జై భీం,

మీరు నాయకుడిగా ఎదగాలని అనుకుంటున్నారా...?
మీరనుకున్న వార్తలు రావాలని కోరుకుంటున్నారా...?
పెట్టుబడి లేకుండా ఆదాయం పొందాలని అనుకుంటున్నారా...?
మీరూ మీ అసెంబ్లీ నియోజకవర్గం లో
టీవీ ఛానల్ ఓనర్ గా కావాలని అనుకుంటున్నారా...?

అయితే రండి, కదలి రండీ

బహుజనాభివృద్ధే.. దేశాభివృద్ధి అని నిరూపిద్దాం

1. ఈ దేశంలో ఉన్న ఫోర్త్ ఎస్టేట్ (మీడియా రంగం) బహుజనుల సమస్యల మీద ప్రచారం చేయడం లేదని మీ అందరికీ తెలుసు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా విలేఖరులకు సామాజిక కార్యకర్తలకు, అంబేడ్కర్, ఫూలే సంఘం నాయకులకు, కనీసం 100 మంది తెలిసిన గ్రూపునాయకులకు టీవీ ఛానల్ ప్రతినిధిగా / యజమానిగా అవకాశం ఇవ్వబడును.
2. జీవిత కాలంలో ఆయా అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతినిధిగా / యజమానిగా నియమించబడును.
3. ఆయా ప్రతినిధికి ప్రకటనల ఆదాయం (Advertising Revenue)లో ప్రకటనలపై 40% ఆదాయం ఇవ్వబడును.
4. వార్తలను స్వేచ్ఛాయతంగా ప్రసారం (Telecast) చేసే వీలు కల్పించబడును.

సంప్రదించండి

Tel No: 9849031420 ,9440918143, 94409 18371, 94400 53858, 93473 50692,8008840506, 9440077239, 7798832998, 76600 27678,

Office: Ambedkar TV Channel, 3rd Floor, Dault Plaza, Main Road, Besides Bata Showroom, Lakdi ka pool, Hyderabad - 500004

E- mail : ambedkartvchannel2018@gmail.com www.ambedkartv.org


Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printing at :SEHASAI PRINTERS, D. 3-88, CHANRA TEATRE, GOSALA MAIN ROAD PENAMALURU MANDAL, DIST KRISHNA , ANDHRAPRADESH.,Published at H.No. 5+-61-3,Rajendra Nagar,Seetham peta, Visakha patnam-16,Andhrapradesh,India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com